

మావోయిస్టు చలపతి

తవణంపల్లె మండలం మత్యంపైపల్లె వాసి

మదనపల్లె పట్టుశాఖలో పూర్వ ఉద్యోగి

సెంట్రల్ కమిటీ దాకా ఎదిగిన చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి గారి ప్రతాప్‌రెడ్డిపై జిల్లాలో చర్చ



- 6లో

మన జిల్లా వాడే!

చిత్తూరు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఒడిశా-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని గరియా బంద్ జిల్లా కులారి ఘాట్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి గారి ప్రతాప్‌రెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లావాసి అని తెలియడంతో విస్తృత చర్చ జరుగుతోంది. జిల్లా నుంచి ఇంకా ఇంత పెద్ద నాయకుడు మావోయిస్టుల్లో ఉన్నాడా అని అందరూ ఆశ్చర్యపోతున్నారు. చలపతి స్వస్థలం అయిన తవణంపల్లె మండలం మత్యంపైపల్లె గ్రామంలో అయితే ఏ వివరాలు చెబితే ఏమవుతుందో అని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చలపతికి తమ ఊరికీ అసలు సంబంధమే లేదని చెబుతున్నారు. అయితే ఈయన అన్న కుమారుడు ఒకరు ఇప్పటికీ గ్రామంలో ఉన్నారు.మరో అన్న మదనపల్లె పట్టుపరిశ్రమ శాఖలో పనిచేస్తున్నారు.అయితే బంధుత్వాలు చెప్పుకోవడానికి వీరు ఇష్టపడడం లేదు. చలపతి తల్లిదండ్రులు మరణించారు.ఆయనకు ఇద్దరు అన్నలని ఒకరు మరణించగా మరొకరు ప్రభుత్వ ఉద్యోగి అని సమాచారం.

70 ఏళ్ల కిందటే ఊరొదిలేశారు

చలపతి పుట్టకముందే వారి తల్లిదండ్రులు మత్యంపైపల్లె గ్రామాన్ని వదిలి వెళ్లిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. చలపతి తండ్రి, తాత పుట్టింది ఇక్కడే అని, 70 ఏళ్ల కిందటే అప్పట్లో ఉన్న పూరి గుడిసె, ఉన్న కొద్దిపాటి స్థలాన్ని అమ్ముకుని గ్రామాన్ని వదిలి వెళ్లిపోయారని, దాంతో వారికి ఈ గ్రామంతో ఎలాంటి సంబంధం లేదని స్థానికులు చెబుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి..

చలపతి మదనపల్లెలో పట్టుశాఖలో పనిచేస్తూ విశాఖ జిల్లాకు బదిలీ అయ్యారని, అక్కడి పరిచయాలే ఆయనను మావోయిస్టుగా మార్చాయని తెలుస్తోంది. ఉద్యోగాన్ని సైతం వదిలేసి అజ్ఞాతజీవితాన్ని ఎంచుకున్నారని, ఆ ప్రాంతానికే చెందిన మావోయిస్టు నాయకురాలు అరుణతో ఆయనకు పెళ్లి కూడా అయ్యిందంటున్నారు.

ఎన్నోసార్లు తప్పించుకుని..

గతంలో అనేక సందర్భాల్లో ఎదురుకాల్పుల్లో తప్పించుకున్న చలపతి ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో బలైపోయారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల పోలీసులతో పాటు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది దాదాపు వెయ్యిమందికిపైగా కలిసి చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో మరణించిన 27మందిలో ఆయన ఒకడయ్యారు.


చత్తీస్‌గఢ్ అడవుల్లో చలపతి మృతదేహం

గొప్ప వ్యూహకర్త

అంకితభావం గల గెరిల్లాగా చలపతి మావోయిస్టు పార్టీలో అగ్రనాయకుడిగా ఎదిగారు. మంచి వ్యూహకర్తగా ఆ పార్టీలో పేరు తెచ్చుకున్నారు. 2003లో అప్పటి సీఎం చంద్రబాబు మీద అలిపిరి వద్ద నక్సల్స్ చేసిన దాడిలోనూ చలపతి పాత్ర ఉందని పోలీసులు భావించారు. 2018లో టీడీపీ అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వర రావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోములను కాల్చి చంపిన ఘటనలోనూ చలపతి సూత్రధారి అని తెలుస్తోంది.ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన చలపతి ఒడిశా రాష్ట్ర మావోయిస్టు కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఇప్పటికే ఇతనిపై రూ.కోటి రివార్డును కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈయనను హతమార్చినందుకు కేంద్ర హోం మంత్రి ఎక్స్ వేదికగా బలగాలను అభినందించారు కూడా. ఇంత కీలకమైన మావోయిస్టు నాయకుడు జిల్లాకు చెందినవాడు కావడం పట్ల జనం దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.


జిల్లా అధ్యక్షుడి పేరును ప్రకటిస్తున్న ఆర్వో యల్లారెడ్డి

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా జగదీశ్వర్

చిత్తూరు సెంట్రల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎస్.జగదీశ్వర్‌నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా జగదీశ్వర్ నాయుడిని జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన కడప జిల్లా మాజీ అధ్యక్షుడు కె.యల్లారెడ్డి ప్రకటించారు. రాయలసీమ జోన్ ఇన్‌చార్జి, పరిశీలకుడిగా హాజరైన బిట్ర శివన్నారయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర చౌదరి మాట్లాడుతూ.. నిబద్ధతతో పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఏఆర్వో రవికుమార్, చంద్రమోహన్, రాష్ట్ర నాయకులు ఈశ్వర్ ప్రసాద్, రెడ్డిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, షణ్ముగం, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు 10 మద్యం దుకాణాల కేటాయింపు

చిత్తూరు సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గీత కార్మికులకు ప్రత్యేకంగా 10 మద్యం దుకాణాలు కేటాయిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది అక్టోబరు 16వ తేదీ నుంచి నూతన మద్యం దుకాణాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గీత కార్మికుల కోసం 10 దుకాణాలను కేటాయించారు. ఈ దుకాణాలను కూడా లాటరీ ద్వారా కేటాయిస్తారు. దీనికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ, లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు తేదీలను త్వరలో ప్రకటించనున్నారు.

ఎస్‌ఆర్‌పురంలో 'క్వారీ'లాట

శ్రీరంగరాజపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగరాజపురం మండలం ఆర్‌ఆర్‌పురం సమీపంలో సుమారు మూడు ఎకరాల గ్రానైట్ క్వారీ వివాదాలకు కేంద్రంగా మారింది. మంగళవారం ఆ క్వారీ తమదంటే తమదని వాగ్వాదాలు నడిచాయి. కొంత కాలంగా ఈ క్వారీలో చిత్తూరుకు చెందిన శేఖర్ బాబు పనులు చేసుకుంటున్నారు. మంగళవారం తమిళనాడుకు చెందిన భానుప్రతాప్ అనే వ్యక్తి క్వారీ వద్దకు వచ్చి 'ఇది నా క్వారీ. వెంటనే పనులు నిలిపివేయండి' అంటూ ప్రెస్‌మీట్ పెట్టారు. అదే మండలం పిల్లిగుండ్లపల్లెకు చెందిన గుణశేఖర్‌నాయుడు కూడా అక్కడి వచ్చి.. 'ఇక్కడే ఆనుకుని మా భూమి కూడా ఉంది. సర్వే తర్వాత పనులు చేసుకోండి' అన్నారు. ముగ్గురి మధ్య వాదోపవాదాలు జరిగాయి. పోలీసులు కల్పించుకుని ముగ్గుర్నీ స్టేషన్‌కు పిలుచుకుని వెళ్లారు. సరైన రికార్డులు తెచ్చినవారు క్వారీ పనులు చేసుకోవాలని సూచించారు. తాత్కాలికంగా క్వారీలో పనుల్ని నిలిపేశారు.ఇదిలా ఉండగా, 2017లో భానుప్రతాప్ తండ్రి మణినాయుడు ఈ క్వారీకి ఎన్‌వోసీ తీసుకున్నట్లు తెలుస్తోంది. కరోనా సమయంలో మణినాయుడు మరణించగా.. 2019లో పెద్దఎత్తున ఫైన్ వేసి అధికారులు మూసేశారు. కొంత కాలంగా శేఖర్‌బాబు ఇక్కడ పనులు చేసుకుంటున్నారు. క్వారీ నుంచి గ్రానైట్ దిమ్మెలు తరలిస్తుండడంతో మంగళవారం భానుప్రతాప్ అడ్డుకున్నారు.


రోదిస్తున్న కార్తీక్ తల్లి సెల్వి

శోకసంద్రంలో ఎగువరాగిమానుపెంట


గ్రామస్తుల నివాళులు

అమర జవాన్ కార్తీక్‌కు నేడు అంతిమ సంస్కారాలు

బంగారుపాళ్యం,జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడి వీర మరణం పొందిన యువ జవాన్ కార్తీక్ యాదవ్‌కు నేడు స్వగ్రామమైన ఎగువరాగిమానుపెంటలో అధికార లాంఛనాల నడుమ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.కార్తీక్ మృతి వార్తతో ఆయన కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులంతా విషాదంలో మునిగిపోయారు.బంగారుపాళ్యం మండలం ఎగువరాగిమానుపెంట గ్రామానికి చెందిన వరదరాజులు,సెల్వి దంపతుల చిన్న కుమారుడు కార్తీక్ యాదవ్(29) పదేళ్ల క్రితం ఆర్మీలో చేరాడు.రాజస్తాన్ ఆర్మ్‌డ్ రెజిమెంట్‌లో ఏడేళ్ల పాటు పని చేశాక రెండేళ్ల క్రితం జమ్ముకు బదిలీ అయ్యారు.ఉగ్రవాదులను ఏరివేసే కూంబింగ్ రైఫిల్ విభాగంలో పనిచేస్తున్నారు.ఆదివారం జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులతో జరిగిన భీకరపోరులో కార్తీక్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆర్మీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. ఈ సమాచారాన్ని ఆర్మీ అధికారులు ఫోన్ ద్వారా చెప్పడంతో కార్తీక్ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు.శనివారం ఫోన్‌లో మాట్లాడుతూ సెలవుల్లో ఇంటికి వస్తానని చెప్పాడని, మరుసటి రోజే ఇలా జరిగిందంటూ కార్తీక్ తల్లి కన్నీరు మున్నీరైంది.కార్తీక్ అన్న రాజేష్ మాట్లాడుతూ తన తమ్ముడికి పెళ్లి సంబంధాలు కూడా చూస్తున్నామని ఇంతలో ఘోరం జరిగిపోయిందని ఏడుస్తూ చెప్పాడు.కాగా కార్తీక్‌యాదవ్‌కు బుధవారం స్వగ్రామంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కార్తీక్ భౌతికకాయం బుధవారం ఉదయానికి ఎగువరాగిమానుపెంటకు తీసుకొచ్చేందుకు ఆర్మీ అధికారులు ఏర్పాట్లు చేశారు.అంత్యక్రియల ఏర్పాట్లను తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్,ఆర్‌ఐ మధుసూదన్ పర్యవేక్షిస్తున్నారు. కాగా వీరజవాన్ కార్తీక్‌కు స్వగ్రామంలో మంగళవారం రాత్రి స్నేహితులు, గ్రామస్తులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

రాష్ట్రపతి విందుకు ఆహ్వానం

- పీఎంఏవై కింద ఇల్లు కట్టుకున్న చిత్తూరు మహిళకు అవకాశం

చిత్తూరు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సామాన్య పేద కుటుంబానికి చెందిన ఓ మహిళ రాష్ట్రపతి భవన్‌లో ఈనెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా సాయంత్రం 4 గంటలకు జరిగే విందుకు ఎంపికైంది. కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద దేశ వ్యాప్తంగా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్) కింద ఇల్లు కట్టుకున్న చిత్తూరు న్యూ ప్రశాంత్‌నగర్‌కు చెందిన సల్మా ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన లేఖను తపాలాశాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ గణపతి, అసిస్టెంట్ పోస్టుమాస్టర్ భాస్కర్, పోస్టు ఉమెన్ లక్ష్మీప్రసన్నలతో పాటు హౌసింగ్ ఏఈ శ్రీధర్ స్వయంగా వెళ్లి సల్మాకు మంగళవారం అందించారు. సల్మాతోపాటు ఆమె భర్త సర్దార్ షరీఫ్‌కు ప్రయాణ ఖర్చులతో పాటు ఢిల్లీలో వసతి, ఇతర సౌకర్యాలను రాష్ట్రపతి భవనే భరిస్తుందని ఆ లేఖలో పేర్కొన్నారు.


సల్మాకు ఆహ్వానపత్రికను అందిస్తున్న తపాలాశాఖ అధికారులు

నేడు ద్రావిడ వర్సిటీకి న్యాక్ కమిటీ రాక

గుడుపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఈనెల 22న బుధవారం న్యాక్ సభ్యుల బృందం సందర్శించనున్నట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్ తెలిపారు. ఏడుగురు సభ్యులతో కూడిన న్యాక్ పీర్ టీమ్ వర్సిటీలోని ప్రతి విభాగాన్ని మూడు రోజుల పాటు సందర్శించనుంది. విశ్వవిద్యాలయానికి సంబంధిన పూర్తి సమాచారాన్ని ఇప్పటికే అధికారులు న్యాక్ కార్యాలయానికి అందించారు. న్యాక్ టీమ్ కమిటీ సందర్శన అనంతరం విశ్వవిద్యాలయాకి న్యాక్ గ్రేడింగ్ ఇవ్వనుంది. గతంలో విశ్వవిద్యాలయానికి బీ-ప్లస్ ఇవ్వగా.. ఈసారి ఏ గ్రేడ్ వస్తుందని అధికారులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.



ఒంటరి.. పిల్లల ఏనుగులను తరమొద్దు

- భాకరాపేట, పనపాకం రేంజ్‌లో 15 గజరాజుల సంచారం
- ప్రాణ, పంట నష్టపరిహారం పెంచాం
- 'ఆంధ్రజ్యోతి'తో సీసీఎఫ్ సెల్వం

చిత్తూరు,తిరుపతి జిల్లాల్లో ఏనుగుల సంచారం పెరిగింది. ప్రాణ, పంట నష్టాలకు గజరాజులు తరచూ కారణమవుతున్నాయి. శనివారం రాత్రి చంద్రగిరి మండలం శేషాపురం సమీపంలో ఉప సర్పంచి రాకేష్‌చౌదరిని తొక్కి చంపేశాయి. ఈ క్రమంలో ఏనుగుల గుంపు వచ్చినప్పుడు ఏం చేయాలి? ఏం చేయకూడదు? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే వివరాలను అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ సెల్వం 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

- మంగళం, ఆంధ్రజ్యోతి


సీసీఎఫ్ సెల్వం

భాకరాపేట, పనబాకం రేంజ్ పరిధిలో 15 ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఆహారం కోసం శేషాచల అటవీ సమీప పంట పొలాల్లోకి వస్తున్నాయి. ఏనుగులు పిల్లలకు జన్మనిచ్చినప్పుడు.. ఒంటరిగా ఉన్నప్పుడు చాలా ఆవేశంగా ఉంటాయి. చిన్న అలికిడికీ తీవ్రంగా స్పందిస్తాయి. ఈ పరిస్థితుల్లో వీటిని తరిమే సాహసం చేయొద్దు. వాటికి 500 మీటర్ల దూరంలో ఉండాలి. అప్పుడే అవి దాడికి ప్రయత్నించినా తప్పించుకునే అవకాశాలుంటాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఏనుగులు తిరుగుతున్నాయని తెలిస్తే సాయంత్రం ఆరు నుంచి తెల్లవారుజాము వరకు ఆ వైపు వెళ్లకుండా ఉండటం మంచిది. రాత్రిపూట ఏనుగులు పంట పొలాల్లో ప్రజలను చూసినప్పుడు కనపడకుండా, శబ్దం చేయకుండా పక్కనే ఉంటాయి. పగటిపూటా ఇలాగే చెట్టు చాటున దాక్కుంటే సమీపానికి వెళ్లేంత వరకు వాటిని చూడలేం. రాత్రిపూట ఏనుగులు పంట పొలాల్లోకి వస్తే ఆ సమయంలో అక్కడికి వెళ్లే వారు డార్క్ కలర్ దుస్తులు వేసుకోవాలి.ఏనుగులను తప్పెట్లు, టపాకాయలు పేల్చి బలవంతంగా అటవీ ప్రాంతంలోకి పంపిస్తే అవి తిరిగి పంట పొలాల్లోకి వచ్చి ఎక్కువ నష్టం కలుగజేస్తాయి. వీటి పరిస్థితిని అర్థం చేసుకున్న అటవీ శాఖ అధికారులు మాత్రమే ఏనుగుల గుంపును అడవిలోకి పంపడానికి ప్రయత్నిస్తారు. కుంకీ ఏనుగుల ద్వారా ఏనుగులను తిరిగి అడవుల్లోకి పంపడానికి 30 మంది అటవీశాఖ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. ననియాల వద్ద రెండు కుంకీ ఏనుగులు ఉన్నాయి. కర్ణాటక నుంచి మరో నాలుగు తెప్పించే ప్రయత్నం చేస్తున్నాం.

ఏనుగులు కనపడ్డాయంటే..

ఎవరికైనా ఏనుగులు కనిపిస్తే 1800 4255909 టోల్ ఫ్రీ నెంబరుకు లేదా ఆ ప్రాంత అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

పరిహారం రూ.10లక్షలకు పెంచాం

ఏనుగుల దాడిలో చనిపోయిన వ్యక్తులకు గతంలో నష్టపరిహారం రూ.5 లక్షలుంటే ఇప్పుడు రూ.10 లక్షలకు పెంచారు. అదీ 24 గంటల్లోనే అందజేస్తున్నారు.తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.80 వేల నుంచి రూ.2 లక్షలకు పెంచగా.. స్వల్పంగా గాయపడ్డ వారికి రూ.25వేలు ఇస్తున్నారు. ఎకరా వరి పంటకు రూ.8వేల నుంచి రూ.10వేలకు, చెరకు పంటకు రూ.12వేలు, ఒక కొబ్బరి చెట్టుకు రూ.2వేలు, అరటిచెట్లకు ఎకరాలో నష్టాన్ని బట్టి రూ.24వేల చొప్పున.. వారం రోజుల్లోనే నష్టపరిహారం అందిస్తున్నారు.

ఎస్వీయూలో చిరుత!

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలోని హెచ్-బ్లాక్ హాస్టల్ సమీపంలో మంగళవారం రాత్రి చిరుత సంచరించినట్టు తెలిసింది. దీంతో భయాందోళన నెలకొంది. ఇప్పటికే విద్యార్థులు, ఉద్యోగులను అధికారులు అప్రమత్తం చేశారు. చిరుత సంచారం నేపథ్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రాత్రి 7 నుంచీ ఉదయం 7 గంటల మధ్య విద్యార్థులు, ఉద్యోగులు సంచరించకూడదని సూచించారు. వర్సిటీలో ఎక్కువగా ఉన్న కుక్కల కోసం చిరుత వస్తున్నట్టు ఫారెస్టు అధికారులు తెలిపారు. అందుకని కుక్కలు పట్టించేలా వర్సిటీ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

డాడీతో సినిమాకి టైం ఉంది

● హీరో ఆకాష్ పూరి



తిరుమల, జనవరి21(ఆంధ్రజ్యోతి): తన తండ్రి పూరి జగన్నాథ్‌తో సినిమా చేయడానికి ఇంకా టైం ఉందని హీరో ఆకాష్ పూరి తెలిపారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, చాలా రోజుల తర్వాత అద్భుతమైన శ్రీవారి దర్శనం లభించిందన్నారు. త్వరలో 'తల్వార్' సినిమా చేయబోతున్నట్టు తెలిపారు. ఈ సినిమా షూటింగ్ జనవరి నెలాఖరులో ప్రారంభమవుతుందన్నారు. అందుకే స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చానన్నారు. ఇక, తన తండ్రి దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ కథ రాస్తున్నారని, ఎవరు హీరో అనేది ఇంకా ఫిక్స్ కాలేదని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

శ్రీవారి సేవలో గాయని మంగ్లీ

తిరుమల, జనవరి21 (ఆంధ్రజ్యోతి):గాయని మంగ్లీ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి ఆమె మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.



విజయశ్రీ, మంగ్లీ


సర్వదర్శనానికి 12 గంటలు


తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం : రూ.3.59 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 83,806

తలనీలాలు సమర్పించినవారు: 23,352





ప్రచారం లేకున్నా... పక్షుల పండుగ సూపర్ హిట్!



అన్నీ తానై వ్యవహరించిన జిల్లా కలెక్టర్

స్థానిక ఎమ్మెల్యేతో సమన్వయం

తడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సమయం లేదు... ప్రచారం అంతకన్నా లేదు... మధ్యలో కొన్ని ఆటంకాలు... అయినా ఇంతపెద్ద పండుగను విజయవంతం చేయగలిగారు అధికారులు. ఉమ్మడి నెల్లూరుజిల్లాలో 2001లో ప్రారంభమైన పక్షుల పండుగను 2020 దాక నిర్వహించారు. జగన్ ప్రభుత్వం ఒక ఏడాది మొక్కుబడిగా నిర్వహించి నాలుగేళ్ల చేతులెత్తేసింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే మళ్లీ పక్షుల పండుగను ఘనంగా నిర్వహించాలనే నిర్ణయం తీసుకుంది. తిరుపతి జిల్లా ఏర్పడ్డాక తొలిసారి ఈ పండుగ నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధపడింది. ఏర్పాట్లు మొదలయ్యే సమయంలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల క్యూలో తొక్కిసలాట సంఘటన కుదిపేసింది. జిల్లా అధికారులంతా దానిమీద దృష్టి పెట్టాల్సివచ్చింది. ఈలోగా సంక్రాంతి పండుగ దినాలు వచ్చేశాయి. పాఠశాలలకు సెలవులు కావడంతో విద్యార్థులు పండుగకు రారనే అనుమానం ఏర్పడింది. పక్షుల పండుగ తేదీలను అప్పటికే మార్చినందున మరోసారి మార్చేందుకు సిద్ధపడలేదు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం ఉన్న అతి కొద్దిరోజులలోనే రాత్రి, పగలు తేడా లేకుండా పక్షుల పండుగ ఏర్పాట్లను పూర్తిచేయడం విశేషం. ఈ హడావుడిలో ప్రచారం కూడా పెద్దగా చేయలేకపోయారు. తొలిరోజు సమావేశానికి మంత్రి కందుల దుర్గేష్ హాజరయ్యారు. సమావేశం జనం లేక వెలవెలబోయింది.రాజకీయ ప్రత్యర్థులు అధికార కూటమిపై విఫలం అంటూ విమర్శల దాడి మొదలు పెట్టారు. వీరికి తోడు వాన కూడా కురిసి ప్రధాన ప్రాంగణం బురదమయం అయ్యింది. అయినా అధికార యంత్రాంగం వెనకడుగు వేయలేదు. ఆగమేఘాలపై మైదానం సిద్ధం చేశారు. ఆకట్టుకునేలా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో శనివారం మధ్యాహ్నం నుంచి తండోపతండాలుగా జనం రావడం మొదలుపెట్టారు. రెండవరోజు ఆదివారం కావడంతో కుటుంబాలతో సందర్శకులు పోటెత్తారు. నేలపట్టు, అటకానితిప్ప, సూళ్లూరుపేట, బీములవారిపాళెం పడవలరేవు ఉదయం నుంచే జనంతో కిటకిటలాడిపోయాయి. సాయంత్రానికి ఆ రద్దీ మూడింతలైంది. భద్రత దృష్ట్యా పడవకి పదిమందినే అనుమతించడం, అందరికీ లైఫ్ జాకెట్లు ఉండేలా శ్రద్ధ తీసుకోవడం, తాత్కాలిక ప్లాట్ ఫారాలు ఏర్పాటు చేసి నేరుగా పడవలోకి ఎక్కేలా చూడడం వంటి చర్యల వల్ల చిన్న సంఘటన కూడా జరగలేదు.



అటకానితిప్ప వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ (ఫైల్ ఫొటో)

సాంస్కృతిక కార్యక్రమాలు హైలెట్

సాంస్కృతిక కార్యక్రమాలు ఈ ఏడాది విశేషంగా ఆకట్టుకున్నాయి. సినీ కళాకారులు రావడంతో జనం పెద్ద సంఖ్యలో మూడు రోజులూ వచ్చారు. సూళ్లూరుపేట కళాశాల మైదానంతోపాటు దాని చుట్టుపక్కల రోడ్లు అన్ని కిటకిటలాడాయి. మూడవరోజున సోమవారం అర్ధరాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగినా జనం కదలకుండా తిలకించసాగారు.

పోలీసుల సేవలు భేష్

తిరుపతి దుర్ఘటన నేపథ్యంలో పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలకు జనం పోటెత్తి వచ్చినా చిన్న సంఘటన కూడా జరగకుండా నియంత్రించారు. కళాశాల మెయిన్ గేట్ వద్ద ఆదివారం కొంత తోపులాట జరగడంతో అప్రమత్తమై నిమిషాలలోనే పరిస్థితి అదుపులోకి తీసుకువచ్చారు.

కలెక్టర్.. ఎమ్మెల్యే ఎనలేని కృషి

పండుగ విజయానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీలు సమన్వయంతో కృషి చేశారు. ఎక్కడ సమస్య తలెత్తినా అప్పటికప్పుడు పరిష్కారదిశగా చర్యలు తీసుకున్నారు.

ఇవీ లోపాలు..

- ఇంత భారీ ఎత్తున జరిగిన కార్యక్రమాలకు అనేక ప్రాంతాల నుంచి జనం వస్తారని అంచనా ఉన్నా తగినన్ని బస్సులను ఏర్పాటు చేయలేకపోయారు.
- నేలపట్టులో, అటకానితిప్పలో వేదికలు ఏర్పాటు చేసినా ఆకట్టుకునే కార్యక్రమాలను నిర్వహించలేకపోయారు.
- బీవీపాలెం పడవల రేవులో పడవకు పది మందిని మాత్రమే అనుమతించడంతో జనం గంటలకు గంటలు ఎదురు చూడాల్సి వచ్చింది. ఇంకా ఎక్కువ పడవలను ఏర్పాటు చేసి ఉండాల్సింది.
- వివిధ ప్రాంతాల్లో ముందస్తు ప్రచారం జరగలేదు. కేవలం ఒక పత్రికలో చిన్న ప్రకటనతో సరిపెట్టుకున్నారు. సోషల్ మీడియాను కూడా తగినంతగా వినియోగించుకోలేదు.

నలుగురు స్మార్ట్ ఫోన్ దొంగల అరెస్టు

● 50 సెల్‌ఫోన్ల స్వాధీనం
● నిందితుల్లో బాలుడు ● బోస్టన్ స్కూల్‌కు తరలింపు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

శ్రీకాళహస్తి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌ఫోన్లను టార్గెట్‌గా చేసుకుని చోరీ చేసే బాలుడి సహా మరో ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహామూర్తి తెలిపిన ప్రకారం.. కర్నూలు జిల్లా డోన్ పట్టణం శివరాంపేటకు చెందిన వెంకటసాయి(22) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకునేవాడు. డోన్‌లోని శ్రీరామ్‌నగర్ ప్రాంతానికి చెందిన మురళి(37) కూడా హైదరాబాద్‌లో కీసరలో కూలీ పనులు చేస్తుంటాడు. అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రం మండలం ఎల్‌బీ కాలనీకి చెందిన సాయిశివ(29) ప్రైవేటు పనులు చేస్తుండేవాడు. ఈ ముగ్గురు కలిసి ఈజీమనీ కోసం స్మార్ట్‌ఫోన్లను చోరీ చేస్తుండేవారు. వీరికి హైదరాబాద్ నగరం ఎల్‌బీనగర్‌కు చెందిన 12 ఏళ్ల బాలుడు తోడయ్యాడు. ఈక్రమంలో శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో పట్టణ శివార్లలోని నంది కూడలి వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. పోలీసులను గమనించిన ఓ కారు వేగంగా వెళ్లిపోతుండగా అడ్డుకున్నారు. కారులోని వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల విచారణలో అంతర్రాష్ట్ర స్మార్ట్‌ఫోన్ దొంగలుగా తేలింది. వారి నుంచి 50 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బాలుడిని బోస్టన్ స్కూల్‌కు తరలించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ముగ్గురు యువకుల అరెస్టు చూపారు. నిందితులను రిమాండుకు తరలించారు.

ఒకప్పుడు మన జిల్లా ఉద్యమాల ఖిల్లా!

భూస్వాముల హత్యలు.. నక్సల్స్ ఎన్‌కౌంటర్లతో అట్టుడికిన చరిత్ర

చలపతి ఎన్‌కౌంటర్‌తో జిల్లాలో ముగిసిన మావోయిస్టు అధ్యాయం



తిరుపతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లో మంగళవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి అలియాస్ చలపతి మృతి చెందడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నక్సల్స్ పరంగా ఓ అధ్యాయం ముగిసినట్టయింది. జిల్లా నుంచీ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో సభ్యుడుగా ఎదిగిన ఏకైక నక్సల్‌గా ఆయన గుర్తింపు పొందారు. నక్సల్ ఉద్యమంలో జిల్లాకు సంబంధించినంతవరకూ ఆయన చివరి వ్యక్తి. జిల్లా వామపక్ష తీవ్రవాద చరిత్రలో రామచంద్రారెడ్డి అలియాస్ చలపతి మరణంతో ఓ అధ్యాయం ముగిసినట్టయింది. 1970ల నుంచీ 2003 వరకూ సుమారు మూడు దశాబ్దాల పాటు జిల్లాలో రాడికల్, రైతు కూలీ సంఘం, నక్సల్ తదితర పేర్లతో మావోయిస్టు ఉద్యమం ఉధృతంగా సాగింది. ప్రస్తుత తరానికి పెద్దగా తెలియని ఆ ఉద్యమ కాలాన్ని అప్పటివారు చలపతి ఎన్‌కౌంటర్‌తో ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు.

ఎస్వీయూలో పురుడు పోసుకున్న రాడికల్స్

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించినంతవరకూ 1970వ దశకంలో రాడికల్ విద్యార్థి సంఘం పేరిట తీవ్రవాద వామపక్ష భావజాలమున్న ఉద్యమం మొదలైంది. తిరుపతిలోని ఎస్వీయూ నుంచీ ప్రారంభమైన ఈ విద్యార్థి సంఘం శాఖలు వేగంగా జిల్లా అంతటా వ్యాపించాయి. ముఖ్యంగా పడమటి ప్రాంతమైన మదనపల్లె, వాయల్పాడు, పీలేరు, తంబళ్లపల్లె, పుంగనూరు తదితర ప్రాంతాల్లో ఆర్‌ఎస్‌యూ బలంగా వేళ్లూనుకుంది. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు ఎక్కువగా ఈ సంఘం వైపు ఆకర్షితులయ్యారు. అలాగే సోమల, చౌడేపల్లె, కలికిరి ప్రాంతాల్లో మెజారిటీ దళిత వాడల యువకులు యూనియన్‌లో చేరి చురుగ్గా పనిచేశారు. ఓ దశలో మదనపల్లెలోని ప్రభుత్వ మోడల్ పాలిటెక్నిక్ ఆర్‌ఎస్‌యూకు కేంద్ర స్థానంగా మారింది. తరచూ రాడికల్ విద్యార్థులు, ఏబీవీపీ విద్యార్థుల నడుమ ఘర్షణలు తలెత్తేవి. ఆ నేపథ్యంలో ఇరువైపులా హత్యలు, ప్రతీకార హత్యలు కూడా జరిగాయి. కాగా రాడికల్ యూత్ లీగ్ పేరిట యువజన విభాగం కూడా చాలా చురుగ్గా పనిచేసింది. ఈ సంఘాల్లో జిల్లా నుంచీ పలువురు కీలక నేతలుగా ఎదిగారు. సూరిశెట్టి సుధాకర్ ఆర్‌ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసి అటు తర్వాత రాష్ట్ర కార్యదర్శిగా రెండు సార్లు వ్యవహరించారు. పోలీసులకు పట్టుబడి విడుదలయ్యాక 1980లలో ఉద్యమం నుంచీ వెలుపలికి వచ్చేశారు. తిరుపతి ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి చంద్రశేఖర్ జిల్లా అధ్యక్షుడుగా పనిచేశారు. మల్లిక్ అనే నేత సైతం తిరుపతిలో కీలకంగా పనిచేశారు. ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి ప్రభాకర్ 1990లలో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.

దళాలతో పీపుల్స్‌వార్

మావోయిస్టు పార్టీలో చీలక సంభవించి కొండపల్లి సీతారామయ్య వర్గం నుంచి వేరుపడి పీపుల్స్ వార్ గ్రూప్ ఏర్పాటు అయ్యింది. 1980,90 దశకాల్లో పీపుల్స్‌వార్ గ్రూపు కార్యకలాపాలు జిల్లాలో ఉధృతంగా సాగాయి. పాపాఘ్ని దళం, తలకోన దళం, కాళంగి దళం వంటి పేర్లతో నక్సల్స్ జోరుగా కార్యకలాపాలు నడిపారు.

- వాయల్పాడు పంచాయతీ సమితి మాజీ అధ్యక్షుడు చాకిరేవుపల్లి మల్‌రెడ్డిని కలికిరి క్రాస్ రోడ్డులో నక్సలైట్లు బాంబులు వేసి కొడవళ్ళతో దాడి చేసి చంపారు.
- వాయల్పాడు మండలం గొల్లపల్లిలో మజ్జిగ వెంకటేశు అనే మోతుబరి రైతుకు కాళ్ళు నరికేశారు.
- పెద్ద పంజాణి పోలీసు స్టేషన్‌పై నక్సలైట్లు దాడి చేసి తుపాకులు ఎత్తుకుని పరారైన ఘటన జిల్లాను కుదిపేసింది.
- వాయల్పాడు మండలం చింతపర్తి రైల్వే స్టేషన్‌ను డిటొనేటర్లు పెట్టి పేల్చేశారు.
- కలకడ మండలం కదిరాయచెరువులో టెలిఫోన్ ఎక్స్ఛేంజీని సైతం పేల్చేశారు.
- కంభంవారిపల్లి, ఎర్రావారిపాలెం మండలాల్లో ఎంతోమంది భూస్వాములు, మోతుబరి రైతుల ఇళ్ళు, ఆస్తులు పేల్చేశారు. ఎంతోమందిపై దాడులు చేశారు.

పశ్చిమాన సంచలనం రైతు కూలీ ఉద్యమం

పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె, వాయల్పాడు, పుంగనూరు ప్రాంతాల్లో తలెత్తిన రైతు కూలీ సంఘం భూస్వాములను బెంబేలెత్తించింది. పలువురు భూస్వాములను రైతు కూలీ సంఘ ఉద్యమకారులు హతమార్చారు. ప్రతీకార దాడుల్లో పలువురు ఉద్యమకారులూ ప్రాణాలు పోగొట్టుకున్నారు.

- 1983 సెప్టెంబరులో మదనపల్లె సొసైటీ కాలనీలో తంబళ్లపల్లెకి చెందిన పోస్టాఫీసు రెడ్డెప్పరెడ్డిని ఉద్యమకారులు హత్య చేశారు. ఆయన అప్పట్లో పేరుమోసిన భూస్వాములైన టీఎన్ కుటుంబీకులకు అనుచరుడుగా వుండేవారు.
- 1984 డిసెంబరు 24న ములకలచెరువు మండలం చౌడసముద్రంలో భూస్వామి పుట్టా వెంకట్రమణను రైతు కూలీ సంఘం కార్యకర్తలు బస్సులోనే తుపాకులతో కాల్చి చంపారు. ఆయన రైతు కూలీ సంఘానికి వ్యతిరేకంగా భూస్వాములను ఏకం చేసి రైతు సంఘం పేరిట కార్యకలాపాలు సాగించిన వ్యక్తి.
- అదే రోజు అర్ధరాత్రి చౌడసముద్రం సమీపంలో ప్రతీకార దాడిలో మాజీ ఎమ్మెల్సీ ఏవీ ఉమాశంకర్‌రెడ్డి హత్యకు గురయ్యారు. ఆయన మాజీ ఎమ్మెల్యే ఏవీ లక్ష్మీదేవమ్మ భర్త.
- మదనపల్లె మల్లిఖార్జున థియేటర్ సమీపంలో తంబళ్ళపల్లి మండలం అన్నగారిపల్లికి చెందిన భూస్వామి నరసింహారెడ్డిని ఉద్యమకారులు బాంబులేసి కత్తులతో పొడిచి చంపారు.
- ములకలచెరువు మండలం చౌడసముద్రం పంచాయతీ రెడ్డెంవారిపల్లి సిద్దారెడ్డి కూడా ఇంటివద్దే ఉద్యమకారుల చేతుల్లో హత్యకు గురయ్యారు.
- ములకలచెరువు మండలం గుత్తావారిపల్లిలో భూస్వామి శివయ్య, అతని మరో ఇద్దరు సన్నిహితులు మొత్తం ముగ్గురు హత్యకు గురయ్యారు.
- దీనికి ప్రతీకారంగా రైతు కూలీ సంఘం నేత నాగిరెడ్డి బస్సు ఎక్కుతుండగా ప్రత్యర్థులు కత్తులతో నరికి చంపారు.
- తంబళ్ళపల్లి మండలం బురుజులో రైతుకూలీ సంఘం నాయకుడు రామిరెడ్డిని ప్రత్యర్థులు గొంతు కోసి చంపారు.
- తంబళ్ళపల్లి పోలీసు స్టేషన్ పక్కనే నివాసమున్న రైతు సంఘం నేత నూకల సుబ్బన్నను ఉద్యమకారులు ఆయన ఇంట్లోనే హత్య చేశారు.

మరణించిన నక్సల్స్

- తంబళ్ళపల్లి మండలం డేగావారిపల్లికి చెందిన పీపుల్స్ వార్ నేత వేమనారాయణరెడ్డి అనంతపురం జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.
- అదే మండలం దబ్బలగుట్టపల్లికి చెందిన నక్సలైట్ వెంకట్రమణారెడ్డి వరంగల్ జిల్లా ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు.
- పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన ఉమ్మడి జిల్లా పీపుల్స్ వార్ కార్యదర్శి మంగలి కృష్ణప్ప అలియాస్ రెడ్డెప్ప, ఆయన భార్య లక్ష్మి, ఆయన తమ్ముడు వెంకటస్వామి ముగ్గురూ కలకడ మండల సరిహద్దుల్లోని గుట్టపల్లి వద్ద 1995లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు.
- ఐరాల మండలానికి చెందిన నక్సల్ నేత మహదేవరెడ్డి కూడా జిల్లాలోనే ఎన్‌కౌంటర్ అయ్యారు.
- శ్రీకాళహస్తి ప్రాంతానికి చెందిన భూపతి అలియాస్ వనార్కం దేయులు నేతృత్వంలో చురుగ్గా పనిచేసిన కాళంగి దళం మొత్తం ఎన్‌కౌంటర్‌లో తుడిచిపెట్టుకుపోయింది. కాళంగి ప్రాజెక్టు సమీపంలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మృతి చెందారు.
- కంభంవారిపల్లి, ఎర్రావారిపాలెం మండలాల సరిహద్దుల్లోని శేషాచల అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కూడా ఐదుగురు నక్సలైట్లు చనిపోయారు.
- పీలేరు శివార్లలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అనంతపురం జిల్లా నక్సలైట్ నాయకుడు ఎర్ర శీను మృతి చెందారు.
- పెద్దమండ్యం మండలం కనమలోల్లపల్లి వద్ద చాకిబండ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మహిళా నక్సలైట్ సహా నలుగురు చనిపోయారు.
- తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థి చలపతి ఆర్మీకి ఎంపికై శిక్షణ మధ్యలో తిరిగి వచ్చేసి పీపుల్స్ వార్‌లో చేరారు. క్రమంగా యాక్షన్ కమిటీ సభ్యుడిగా ఎదిగారు. అరెస్టు అయి జైల్లోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు.

అలిపిరి దాడితో అంతం

సీఎం చంద్రబాబుపై 2003 అక్టోబరులో అలిపిరి వద్ద నక్సలైట్లు క్లైమోర్ మైన్ పేల్చి హత్యాయత్నానికి పాల్పడడం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఆ దాడి నుంచీ చంద్రబాబు త్రుటిలో తప్పించుకున్నారు. ఆ ఘటనతో రాష్ట్ర వ్యాప్తంగా నక్సల్ కార్యకలాపాలపై నిర్బంధం తీవ్రతరమైంది. 2004లో ఏర్పడిన వైఎస్ ప్రభుత్వం సైతం అదే పంథా కొనసాగించడంతో క్రమంగా జిల్లాలో నక్సల్ కార్యకలాపాలు తగ్గుముఖం పడుతూ వచ్చి గత రెండు దశాబ్దాలుగా దాదాపు ఆగిపోయాయి.

25న సుభాష్ పాలేకర్ రాక



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ శనివారం తిరుపతికి రానున్నారు. ఆయన పర్యటన వివరాలను ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఈనెల 25న ఎస్వీయూలోని శ్రీనివాసా ఆడిటోరియంలో వెయ్యి మంది విద్యార్థులకు.. 28న వెయ్యి మంది రైతులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పిస్తారని చెపారు. ఈ సభకు అతిథులుగా మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు పాల్గొంటారన్నారు. వర్డ్ ప్రతినిధి డాక్టర్ గంగాధర్, బోటనీ అధ్యాపకుడు వేణు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, కల్చరల్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. కాగా, 27న పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆడిటోరియంలోనూ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు.

'మహా' మోసం

● కుంభమేళాలో సౌకర్యాలు కల్పిస్తామంటూ రూ.3.65 లక్షలు కాజేసిన నిందితులు
● బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 21(ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళాలో సౌకర్యాలు కల్పిస్తామంటూ రూ.3.65 లక్షలు కాజేశారు. బాధితుడు, న్యాయవాది సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్వీ యూనివర్శిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రామయ్య తెలిపిన ప్రకారం.. తిరుపతి నగరం గాయత్రినగర్‌కు చెందిన న్యాయవాది సుబ్రహ్మణ్యం నేతృత్వంలో 27 మంది కుంభమేళాకు వెళ్లాలనుకున్నారు. అక్కడ కాటేజీలు, భోజన సౌకర్యం తదితరాలు కల్పించే వారికోసం వెబ్‌సైట్‌లో చూశారు. ఇక్కడ అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామంటూ ఉత్తరాదికి చెందిన కొందరు వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. వీరిని నమ్మిన తిరుపతివాసులు మూడు అకౌంట్ల ద్వారా వారి బ్యాంకు ఖాతాలకు రూ.3.65 లక్షలు పంపారు. ఆ తర్వాత 27 మంది కుంభమేళాకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. అయితే, డబ్బులు పంపాక వారిని సంప్రదించడానికి ప్రయత్నిస్తే వారి సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ లేదా తాత్కాలికంగా పనిచేయడంలేదని వచ్చింది. రెండు రోజులు పాటు వీరు ఫోన్లలో ప్రయత్నిస్తూనే ఉన్నారు. చివరకు మంగళవారం ఎస్వీయూ స్టేషన్‌లో బాధితుల తరపున న్యాయవాది సుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేశారు. సీఐ రామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలిపిరిలో కట్టుదిట్టంగా తనిఖీలు

తిరుమల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుమల నుంచి ఎర్రచందనాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో విజిలెన్స్, ఫారెస్ట్ సిబ్బంది అలిపిరి వద్ద నిఘా పెట్టారు. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తిరుమల నుంచి తిరుపతికి చేరుకున్న తర్వాత కూడా వాహనాలు ఆపి తనిఖీలు చేయడంతో పలువురు భక్తులు ఏం జరిగిందో తెలియక కంగారుపడ్డారు.



బెంగళూరు వెళ్లే రైలు 15 రోజులు లేటు!



కుప్పం రైల్వే స్టేషన్ మొదటి ప్లాట్‌ఫామ్‌వైపు జరుగుతున్న ఆధునీకరణ పనులు

కుప్పం రెండో ప్లాట్‌ఫామ్‌పై రేపటినుంచి రైళ్లరాకపోకలు బంద్ ● మూడవ ప్లాట్‌ఫామ్ పనుల ప్రభావం ● ఆందోళనలో నియోజకవర్గ ప్రజలు

కుప్పం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కుప్పంవాసులు బెంగళూరు వెళ్లే రైళ్లు ఈనెల 23 నుంచి 15 రోజులపాటు రద్దవుతున్నాయి.దీంతో ఉద్యోగ, ఉపాధులకోసం నిత్యం వేల సంఖ్యలో బెంగళూరుకు రాకపోకలు సాగించే నియోజకవర్గ ప్రజలు తీవ్ర అందోళన చెందుతున్నారు. సమీప స్టేషనైన మల్లానూరు, గుడుపల్లె స్టేషన్లనోనైనా స్టాపింగ్ ఇవ్వాలంటూ రైల్వే అధికారులకు చేసిన అభ్యర్థనలు పాక్షికంగా ఫలించి, కొన్ని రైళ్ల రాకపోకలకు మాత్రం మల్లానూరు స్టేషన్‌లో స్టాపింగ్ ఇచ్చారు.

కుప్పం రైల్వే స్టేషన్ అమృత్ పథకానికి ఎంపికైంది. ఈ పథకం కింద ఇక్కడ కొన్ని నెలల నుంచీ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కుప్పం రైల్వే స్టేషన్‌కు రెండు ప్లాట్‌ఫామ్‌లే ఉన్నాయి. రైల్వే స్టేషన్ మొదటి ప్లాట్‌ఫామ్ ముందు శుభ్రం చేయడమేకాక, రంగులు వేయించారు. డిజిటల్ బోర్డు ఏర్పాటు చేశారు. ప్లాట్‌ఫామ్‌లను దాటడానికి స్టేషన్‌లో లిఫ్ట్ పెట్టారు. ఇంతకుముందు కోచ్‌ల నెంబర్లు ప్రదర్శన సౌకర్యం లేదు. ఇప్పుడు రెండు ప్లాట్‌ఫామ్‌లపైన కోచ్‌లు ఆగే ప్రదేశాలు తెలిపే డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఇవన్నీ ఒక ఎత్తైతే, ప్రస్తుతం మూడవ ప్లాట్‌ఫామ్ నిర్మాణమవుతుండడం మరోయెత్తు. కుప్పం పట్టణంవైపు కాకుండా కొత్తపేటవైపు ఈ అదనపు ప్లాట్‌పామ్ నిర్మాణమవుతోంది. ఇప్పటికే టికెట్ కౌంటర్ నిర్మించారు. వాహనాల పార్కింగ్‌కు కూడా ఏర్పాటు చేశారు. వారం రోజులనుంచి మూడవ ప్లాట్‌ఫామ్ నిర్మాణ పనులు జోరందుకున్నాయి. ఈ ప్లాట్‌పామ్ నిర్మాణమైతే ఇంకా కొన్ని అదనపు రైళ్లు కుప్పంలో ఆగే వెసులుబాటు దొరుకుతుంది. అంతేకాదు, పట్టణంవైపునుంచే కాక, కొత్తపేటవైపునుంచి కూడా ప్రయాణికులు రైల్వే స్టేషన్ చేరుకుని అటువైపే టికెట్లు చూసుకునే సౌకర్యం దొరుకుతుంది. ఇప్పుడు పనులు జోరందుకోవడంతో అదనపు ప్లాట్‌ఫామ్ నిర్మాణం వేగవంతం చేయడానికి రైల్వే అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవడంలో నిమగ్నమయ్యారు.


నిర్మాణంలో ఉన్న మూడవ ప్లాట్‌ఫామ్

ప్రయాణికులకు అగచాట్లు

కుప్పం రైల్వే స్టేషన్ అమృత్ పథకంలో ఎంపికైనందుకు, అదనపు ప్లాట్‌ఫామ్ నిర్మాణమవడమేకాక, మరికొన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నందుకు కుప్పం నియోజకవర్గ ప్రజలు సంతోషిస్తున్నారు. అయితే వారికి ఇప్పుడు ఈ అభివృద్ధి పనులవల్ల ఊహించని కష్టం వచ్చిపడింది. అదనపు ప్లాట్‌ఫామ్ నిర్మాణ పనులు జరుగుతున్నందున ఈనెల 23నుంచి అంటే గురువారంనుంచి ఫిబ్రవరి 8వ తేదీదాకా మొత్తం 15 రోజులపాటు రెండవ ప్లాట్‌ఫామ్‌మీద రైళ్ల రాకపోకలు ఆగిపోనున్నాయి. రైల్వే అధికారులు ఇప్పటికే ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ ప్రకటనతో కుప్పంవాసులు హతాశులయ్యారు. కుప్పం నియోజకవర్గంనుంచి నిత్యం సుమారు అయిదారువేల మంది వివిధ ఉద్యోగ, ఉపాధుల కోసం బెంగళూరుకు రాకపోకలు సాగిస్తారు. ఉదయం 7.30 గంటలకు వాళ్లు పుష్‌పుల్ రైలు ఎక్కితే, మళ్లీ తిరిగి వచ్చేది సాయంత్రం 7.30 గంటల రైలుకే. ఇలా బెంగళూరుకు రాకపోకలు సాగిస్తూ, ఉద్యోగాలు, వివిధ చిరు వ్యాపారాలు చేసుకుని సంపాదించే వేతనాలు, సొమ్ముతోనే నియోజకవర్గంలోని వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. బెంగళూరునుంచి కుప్పం వచ్చే రైళ్లు ఒకటవ ప్లాట్‌పామ్ మీదుగా వస్తాయి కాబట్టి, వాటికి ఎటువంటి ఇబ్బందీ లేదు. కానీ కుప్పంనుంచి బెంగళూరు వెళ్లే రైళ్లు విధిగా రెండవ ప్లాట్‌ఫామ్ మీదనే వెళ్లాలి. ఇదేవైపున ప్రస్తుతం మూడవ ప్లాట్‌ఫామ్ పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు ఆటంకం కావడంతో ఈ రెండవ ప్లాట్‌ఫామ్‌పై రైళ్ల రాకపోకలు ఈనెల 23నుంచి ఫిబ్రవరి 15వ తేదీదాకా ఆపేశారు. కనీసం సమీపంలో ఉన్న మల్లానూరు లేదా గుడుపల్లె రైల్వే స్టేషన్లనోనైనా స్టాపింగ్ ఇవ్వాలని సాయిమాతా సేవాట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో రైల్వే అధికారులకు చేసుకున్న విన్నపాలు పాక్షికంగా మాత్రమే ఫలించాయి. దీంతో 15 రోజులపాటు ఉద్యోగ, ఉపాధులకోసం బెంగళూరు రాకపోకలు ఎలా చేయాలో అర్థంకాక నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఆందోళన చెందారు. అయితే ఇటువంటి వారు ఎక్కువగా రాకపోకలు సాగించడానికి ఎక్కువగా ఆశ్రయించే పుష్‌పుల్ రైలు కేవలం ఫిబ్రవరి 2, 3, 7, 8 తేదీల్లో, జోలార్‌పేట రైలు 8, 9 తేదీల్లో మాత్రమే రద్దు కావడంతో ఇటువంటి వారికి కొంత ఊపిరిపీల్చుకునే వెసులుబాటు కలుగుతోంది.

● మరికొన్ని రైళ్లకు మల్లానూరు స్టేషన్ స్టాపింగ్: అయితే రైల్వే అధికారులు మంగళవారం సాయంత్రానికి స్పందించి, కొన్ని రైళ్లకు మాత్రం మల్లానూరు రైల్వే స్టేషన్ స్టాపింగ్ ఇచ్చారు. వాటి వివరాలు ఇవీ.

రైలు	నిలిచే తేదీలు	సమయం
07153 ఎస్ఎస్-సీఎంఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్	జనవరి 24, 31, ఫిబ్రవరి 07	06.55/57
16220 టీపీటీవై-సీఎంఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్	జనవరి 24 టు ఫిబ్రవరి 08	01.33/35
22666 సీబీఈ-ఎస్‌బీసీ ఎక్స్‌ప్రెస్	జనవరి 25 టు ఫిబ్రవరి 08	10.13/15
22625 ఎంఏఎస్-ఎస్‌బీసీ ఎక్స్‌ప్రెస్	జనవరి 25 టు 08	10.51/53
12639 ఎంఏఎస్-ఎస్‌బీసీ ఎక్స్‌ప్రెస్	జనవరి 25 టు 08	11.23/25
12609 ఎంఏఎస్-ఎంవైఎస్ ఎక్స్‌ప్రెస్	జనవరి 25 టు 08	17.44/46
12607 ఎంఏఎస్-ఎస్‌బీసీ ఎక్స్‌ప్రెస్	జనవరి 25 టు 08	19.21/23
22617 టీపీటీవై-ఎస్ఎంవీబీ ఎక్స్‌ప్రెస్	జనవరి 26, 28, 31, ఫిబ్రవరి 02, 04, 07	18.45/47
16566 ఎఏఓ-వైపీఆర్ ఎక్స్‌ప్రెస్	జనవరి 27 టు ఫిబ్రవరి 03	09.23/25

విశాఖ ఉక్కు పరిరక్షణకు నడుం బిగించిన బాబు

ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడు కృషితోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా సాధ్యమైందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగోళ్లు వీరోచితంగా పోరాడి, ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న ఉక్కు కర్మాగారం రాష్ట్రానికి మణిహారమన్నారు. విశాఖ ఉక్కు కోసం కూటమి ప్రభుత్వం అన్నిరకాల సహకరిస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం జగన్‌రెడ్డి తన సొంత ప్రయోజనాల కోసమే ఢిల్లీ వెళ్లారన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేట్ పరంచేసి దోచుకోవాలనే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు నడుం బిగించారని వివరించారు.

నేడు ప్రొవిజినల్ మెరిట్ జాబితా విడుదల

చిత్తూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగాలకు సంబంధించిన ప్రొవిజినల్ జాబితాను బుధవారం ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. రీరీరీ.ఛిజిజ్ట్టూుట్పజిఇ.జౌ.జీ వెబ్‌సైట్‌లో జాబితా ఉంటుందని పేర్కొన్నారు. అభ్యంతరాలపై ఈనెల 28వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఫైళ్లన్నీ ఈ-ఆఫీస్ ద్వారానే నిర్వహించాలి

జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు


ఏవోలతో సమావేశమైన జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు

చిత్తూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కార్యాలయంలో ఏ ఫైల్ అయినా ఈ-ఆఫీస్ ద్వారా నిర్వహించాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు ఆదేశించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇటీవల పదోన్నతలు పొందిన ఏవోలకు జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం శిక్షణ, సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండలాల్లో నిర్వహించిన పనులు, ఖర్చుల వివరాలు పక్కాగా ఉండాలన్నారు. ప్రతినెలా పూర్తి వివరాలతో సమావేశానికి హాజరు కావాలని చెప్పారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తొలగింపు

చిత్తూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ మధుబాలను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమెను గత ప్రభుత్వ హయాంలో నియమించారు. కూటమి ప్రభుత్వం రాగానే వైసీపీ ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో నియమితులైనవారు రాజీనామా చేశారు. అయితే మధుబాల మాత్రం రాజీనామా చేయకపోవడంతో ఆమెను ఆ పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

తిరుపతి జిల్లా బీజేపీ సారథి సామంచి



తిరుపతి, జనవరి21(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడుగా సామంచి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. తిరుపతిలో మంగళవారం జరిగిన బీజేపీ అధ్యక్ష ఎన్నికల్లో సామంచిని ఆ పార్టీ ప్రముఖుల సమక్షంలో ఎన్నికల అధికారి పి.సురేందర్‌రెడ్డి ప్రకటించారు. విద్యార్థి దశ నుంచే ఆర్ఎస్ఎస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్)చేరిన సామంచి తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. 1989 నుంచి 99వరకు నగర కార్యదర్శిగా, జిల్లా కన్వీనర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పదేళ్ల పాటు వివిధ హోదాల్లో పనిచేశారు. 1999లో బీజేపీలో చేరిన ఆయన క్షేత్రస్థాయి నుంచి వివిధ హోదాల్లో చురుగ్గా వ్యవహరించారు. తాజాగా రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉంటూ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. సుదీర్ఘకాలం పార్టీకి సేవలందించినప్పటికీ అధికారిక పదవులు దక్కలేదని ఏనాడూ అసంతృప్తిచెందని వ్యక్తిగా సామంచికి మంచి పేరుంది. అతడి విధేయతను గుర్తించిన అధిష్ఠానం జిల్లా బాధ్యతలను అప్పగించినట్టు పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

కాణిపాకం పాఠశాలకు జాతీయ గ్రీన్ స్కూల్ అవార్డు


పాఠశాలలో చెత్త లేకుండా చేస్తున్న విద్యార్థులు

ఐరాల(కాణిపాకం), జనవరి21(ఆంధ్రజ్యోతి): కాణిపాకం జడ్పీ ఉన్నత పాఠశాలకు 2024-25వ సంవత్సరానికి జాతీయ స్థాయిలో గ్రీన్ స్కూల్ అవార్డు వచ్చిందని హెచ్ఎం చంద్రశేఖర్ నాయుడు మంగళవారం తెలిపారు. పాఠశాలలోని ఆహ్లాదకర వాతావరణాన్ని న్యూఢిల్లీలోని సీఎస్ఈ (సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్)కి రాష్ట్రవ్యాప్తంగా ఫొటోలను పంపామన్నారు. మన రాష్ట్రం నుంచి 12 పాఠశాలలు ఎంపికవగా, ఇందులో తమ స్కూల్ ఉండటం ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డుకు తమ పాఠశాల వరుసగా మూడోసారి ఎంపికవడం గర్వంగా ఉందని తెలియజేశారు. ఈ అవార్డును ఫిబ్రవరి 4న న్యూఢిల్లీలో అందుకోనున్నట్లు వివరించారు. ఈ అవార్డు రావడానికి కారణమైన సైన్స్ ఉపాధ్యాయుడు సురేంద్రబాబును, సహకరించిన టీచర్లు సోమశేఖర్ నాయుడు, బాలయ్య, బాలసుబ్రహ్మణ్యం, మాధవరెడ్డి, నరేష్‌బాబును అభినందించారు.

చంద్రబాబు కృషితోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



పలమనేరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితోనే విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం నుంచి ఆర్థిక భరోసా లభించిందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి అన్నారు. మంగళవారం పలమనేరులోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ఆనాడు నష్టాల నుంచి.. నేడు ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ఆంధ్ర రాష్ట్ర మణిహారమని తెలిపారు. విశాఖ ఉక్కు కాపాడేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందన్నారు. తనపై ఉన్న కేసుల నుంచి విముక్తి కలిగిస్తే చాలు.. రాష్ట్ర ప్రయోజనాలతో తనకు అవసరం లేదన్న ధోరణితో మాజీ సీఎం జగన్ ఢిల్లీ పర్యటనలు ఉండేవన్నారు. నేడు అందుకు భిన్నంగా చంద్రబాబు హస్తినకు పర్యటనకు వెళ్లి వచ్చిన ప్రతిసారి ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం గుడ్‌న్యూస్ చెబుతూనే ఉండటాన్ని ప్రజలు గమనించాలన్నారు. నేడు ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయిన విశాఖ స్టీల్ ప్లాంటును కాపాడేందుకు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజిని ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోద ముద్ర వేయడం శుభపరిణామన్నారు. 1998లో నాటి ప్రధాని వాజ్‌పేయితో మాట్లాడి రూ.1600 కోట్లు తీసుకొచ్చి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించారని తెలిపారు. తప్పుడు కూతలతో వైసీపీ ఎంత దుష్ప్రచారం చేసినా వారి మాటలను ప్రజలు వినే పరిస్థితిలో లేరన్నారు. విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయడమే టోటల్ హెల్త్ లక్ష్యం

అపోలో గ్రూప్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న ప్రతాప్ సీ రెడ్డి

తవణంపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయడమే టోటల్ హెల్త్ (సంపూర్ణ ఆరోగ్య పథకం) లక్ష్యమని అపోలో గ్రూప్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి అన్నారు. మంగళవారం తవణంపల్లె మండలంలోని అరగొండ అపోలో సంపూర్ణ ఆరోగ్య కేంద్రంలో సంక్రమణేతర వ్యాధులు (ఎన్‌సీడీ) నివారణ చికిత్స, పరిశోధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్య పథకం 2024లో నిర్వహించిన పరిశోధనల్లో సంక్రమణేతర వ్యాధులకు సంబంధించి ఆందోళనకర గణాంకాలు వెల్లడయ్యాయన్నారు. చిన్న వయస్సులోనే అధిక రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, కొలెస్ట్రాల్, గుండె, మూత్రపిండాల వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. అందువల్ల సంపూర్ణ ఆరోగ్య పథకంలో భాగంగా తవణంపల్లె, ఐరాల మండలంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాను పుట్టిన అరగొండ గ్రామ ప్రజల కోసం ఈ వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. అపోలో వైస్ చైర్‌పర్సన్ ప్రీతారెడ్డి, టోటల్ హెల్త్ సీఈవో రాంబాబు, చిత్తూరు మెడికల్ కాలేజి ఇన్‌చార్జి నరేష్, అరగొండ అపోలో ఏవో చంద్రశేఖర్‌రెడ్డి, నరోత్తమరెడ్డి, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై వినతులను ప్రభుత్వానికి నివేదిస్తాం

● స్పష్టమైన సమాచారం ఇవ్వండి ● ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా


రంజన్‌మిశ్రాకు వినతిపత్రం ఇస్తున్న మాలమహానాడు, ఎమ్మార్పీఎస్ నాయకులు

చిత్తూరు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై అందే వినతులను ప్రభుత్వానికి నివేదిస్తామని ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నివేదికకు అవసరమైన ప్రభుత్వ ఉద్యోగుల వివరాలు, విద్య, రాజకీయ, ఉపాధి, హౌసింగ్, పోలీసు తదితర అంశాలపై కమిషన్ కోరిన మేరకు స్పష్టమైన సమాచారాన్ని అందించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రిజర్వుడు నియోజకవర్గాలుగా జీడీ నెల్లూరు, పూతలపట్టు ఉన్నాయన్నారు. ఎన్నికల తర్వాత డీవీఎంసీ కమిటీలను ఏర్పాటు చేసి సభ్యుల ద్వారా భూ సమస్యలు, ఉపాధి కల్పన తదితర అంశాలపై వినతులను స్వీకరించామన్నారు. అనంతరం దళిత సంఘాల నుంచి మిశ్రా వినతిపత్రాలను స్వీకరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లానుంచి మొత్తం 405 వినతులు అందాయని ఆయన తెలిపారు. ఎస్పీ మణికంఠ, తిరుపతి జేసీ శుభం బన్సల్, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్ కుమార్, డీఎఫ్‌వో భరణి, ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, జిల్లా అధికారులు, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు. అంతకుముందు ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్న మిశ్రాకు జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు.

ఉదయం పెళ్లి పీటలపై.. సాయంత్రం ఉరితాడుకు వేలాడుతూ..

ఆంబాకంలో నవ వధువు బలవన్మరణం


ఆర్తి (ఫైల్ ఫొటో)

సత్యవేడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాళ్ల పారాణి ఆరలేదు. నుదుట కట్టిన భాసిక తీయనే లేదు. తలపై వేసిన అక్షతలు రాలనే లేదు. మంగళ వాయిద్యాల సందడి సద్దుమణగనే లేదు. పెళ్లికొచ్చిన బంధువులు ఇళ్లకు చేరనే లేదు. పెళ్లి పీటలెక్కి గంటలైనా గడవ లేదు.. అంతలోనే ఆ వధువు అనంతలోకాలకు తరలి వెళ్లింది. ఉదయం పెళ్లి జరగ్గా.. సాయంత్రానికి బలవన్మరణానికి పాల్పడింది. సత్యవేడు మండలం ఆంబాకంలో ఈ విషాద ఘటన జరిగింది. ఎస్ఐ రామస్వామి తెలిపిన ప్రకారం.. ఆంబాకం గ్రామానికి చెందిన ధనుంజయ, రది దంపతుల కుమార్తె ఆర్తి(20) చెన్నైలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. అదే గ్రామానికి చెందిన ఈమె మేనమామ సూర్యతో వివాహం నిశ్చయమైంది. ఊతుకోటలో సోమవారం వీరిద్దరి వివాహం జరిపించారు. అటునుంచే నూతన వధూవరులను తీసుకుని తిరుత్తణి ఆలయానికి వెళ్లారు. మధ్యాహ్నం వరుడు సూర్య ఇంటికి వచ్చారు. తనకు అలసటగా ఉందంటూ నిద్ర పోయేందుకు బెడ్‌రూంలోకి వెళ్లిన ఆర్తి తలుపులు మూసుకుంది. సాయంత్రం అవుతున్నా బయటకు రాలేదు. ఎంత పిలిచినా పలకలేదు. కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి గడియ పగులకొట్టి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉంది. వెంటనే ఆమెను ఊతుకోటలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రామస్వామి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పెళ్లయిన గంటల్లోనే పెళ్లికూతురు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

తిరుపతి ఎస్పీ బాధ్యతల స్వీకరణ ఎల్లుండి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా నియమితులైన హర్షవర్ధనరాజు ఈ నెల 24న బాధ్యతలు స్వీకరించనున్నారు. గురువారం సాయంత్రం తిరుపతికి చేరుకుని అక్కడ నుంచి తిరుమలకు వెళ్ళి శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు తీసుకోనున్నారు.

కాణిపాకంలో గార్డెన్ కోసం రూ.10 లక్షలు ఇస్తామన్న చుడా చైర్‌పర్సన్


కాణిపాకంలో స్థల పరిశీలన చేస్తున్న హేమలత

ఐరాల(కాణిపాకం), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో గార్డెన్ కోసం చూడా నుంచి రూ.పది లక్షల నిధులను ఇస్తామని చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత తెలిపారు. మంగళవారం ఆమె వరసిద్ధుడిని దర్శనానికి కాణిపాకం విచ్చేశారు. దర్శనానంతరం ఈవో పెంచలకిషోర్, ఈఈ వెంకటనారాయణతో కలసి ఆలయ పరిసరాల్లో భక్తులకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేలా గార్డెన్ కోసం అవసరమైన స్థలం కోసం పరిశీలన చేశారు. ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదనరావు, ఏఈవో రవీంద్రబాబు, చుడా అధికారులు పాల్గొన్నారు.

డీవీఎంసీ సభ్యుడిగా శేషాద్రి నియామకం



చిత్తూరు కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సభ్యుడిగా చిత్తూరులోని స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఎస్. శేషాద్రిని కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం నియమించారు. ఈ సందర్భంగా శేషాద్రిని ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు అభినందించారు.

24న పద్మావతి పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కాలేజీ నిర్వహిస్తున్న ఫార్మసీ డిప్లొమో కోర్సులో ప్రవేశానికి ఈ నెల 24 వ తేది స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఇంటర్‌లో ఎంపీసీ కానీ, బైపీసీ కానీ పూర్తి చేసిన వారు అర్హులు. ఆసక్తి కలిగిన వారు 23వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం నిర్ణయించిన కోర్సు ఫీజుతో విద్యార్థినులకు ఉచిత హాస్టల్ వసతి కల్పించనున్నారు. మరింత సమాచారం కోసం 92990 08151 నెంబరులో సంప్రదించవచ్చు.

కొటాల పాఠశాలలో టీవీ చోరీ

యాదమరి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలంలోని కొటాల జడ్పీ హైస్కూల్‌లో శనివారం రాత్రి దొంగలు పడ్డారు. గది తలుపు పగులగొట్టి 55 ఇంచుల సైజున్న టీవీని అపహరించుకెళ్లారు. ప్రధానోపాధ్యాయుడు యూసఫ్ సోమవారం ఉదయం ఈ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పశు సంపదతోనే గ్రామీణాభివృద్ధి

- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



శిబిరం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పశు సంపదతోనే గ్రామీణాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్ సురేష్‌బాబు అన్నారు. గుడుపల్లె మండలం అంజనాద్రి, నలగాంపల్లె, బెగ్గిలపల్లె గ్రామాల్లో మంగళవారం పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాల పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా పాడి పశువులను శాస్త్రీయ పద్ధతుల్లో పోషణ చేయాలన్నారు. పాడి రైతుల మేలుకోసం ప్రభుత్వం ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. మూడు గ్రామాల్లో నిర్వహించిన పశు వైద్య శిబిరాలలో 184 ఆవులకు నట్టల నివారణ మందులు ఇచ్చారు. పిడుదుల నివారణకు బుటాక్స్ పచికారీ చేశారు. 42 ఆవులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు అందించారు. పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ రెడ్డికుమారి, గుడుపల్లె పశువైద్యాధికారి డాక్టర్ కోదండరామ్, పశువైద్య సిబ్బంది, పశుసంవర్థక శాఖ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపులి గంగమ్మ ఆలయంలో అభిషేక పూజలు



ఆలయం వద్ద పొంగళ్లు పెడుతున్న మహిళలు

రామకుప్పం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ముద్దనపల్లెలో మంగళవారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఉదయం స్థానిక పెద్దపులి గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి విశేష అలంకరణలు చేపట్టారు. మధ్యాహ్నం ఊరేగింపుగా బయలుదేరి పెద్దపులి గంగమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. సాయంత్రం ఊరిగంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీర్నమలలో ఆకట్టుకున్న జల్లికట్టు



వీర్నమలలో పరుగులు తీస్తున్న గిత్తలు

రామకుప్పం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం వీర్నమలలో మంగళవారం జల్లికట్టు కోలాహలంగా జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ ఉమ్మడి వీర్నమల పంచాయతీ పరిధిలోని గ్రామాలకు చెందిన వారంతా పండుగ సందర్భంగా సొంతూళకుఉ చేరుకున్నారు. వీర్నమల తమిళనాడు సరిహద్దులో ఉండటంతో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల నుంచే కాకుండా తమిళనాడు సరిహద్దు గ్రామాల నుంచి రైతులు వందల సంఖ్యలో కోడె గిత్తలను తీసుకొచ్చారు. ఉదయం స్థానికులు స్థానిక గ్రామ దేవత ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు తమ ఎద్దులను బరిలో పరుగుల తీయించారు. ఎద్దులను నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణం కోదండరామనగర్ కాలనీకి చెందిన వెంకటేశు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ నేతలు వెంకటేశు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరపున రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీసెల్ జిల్లా సభ్యుడు సలాంసాబ్, సీనియర్ నేతలు గుంట్లరెడ్డి, నందారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి వెంకటరమణ, సాగునీటి సంఘం చైర్మన్ పద్మనాభరెడ్డి, పార్టీ పంచాయతీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్‌రెడ్డి, బాలరాజు, యువత అధ్యక్షుడు అవినాశ్, నేతలు ఆదిల్, నియాజ్, మంజునాథ్, అల్లీశీన, ఆంజి, శ్రీరాములు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుకు టీడీపీతోనే పూర్వ వైభవం

కుప్పం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కుకు టీడీపీ ప్రభుత్వంతోనే పూర్వ వైభవం వస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. వైసీపీ హయాంలో విశాఖ స్టీల్ ప్లాంటును అన్యాక్రాంతం చేసేందుకు జగన్ కుట్రపన్నారని ఆరోపించారు. కుప్పం టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేవలం 11 సీట్లతో వైసీపీకి ప్రతిపక్ష హోదా సైతం లేకుండా చేసినా ఆ పార్టీ నేతలకు బుద్ధి రాలేదని ధ్వజమెత్తారు. గత ఐదేళ్లలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వేలాదిమందికి ఉపాధి చూపుతున్న స్టీల్ ప్లాంటును మూసివేశారని గుర్తు చేశారు. విశాఖను ఆర్థిక కేంద్రంగా.. పారిశ్రామిక కేంద్రంగా మార్చడం చంద్రబాబు లక్ష్యమన్నారు. కుప్పం నియోజకవర్గంలో సూర్యఘర్ పథకాన్ని వంద శాతం అమలు చేసి ప్రజలకు ఉచిత విద్యుత్తు అందిస్తామని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, టీడీపీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పొదలకుంట్లపల్లెలో పశువైద్య సేవలు

సోమల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొదలకుంట్లపల్లె, సరస్వతీపురం గ్రామాల్లో మంగళవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వైద్య సేవలు అందింది మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ చందనప్రియ, వైద్య బృందం బావాజాన్, బలరాం, ఓబులేసు, సర్పంచి జయరాం, టీడీపీ నాయకులు బాబురావ్, అష్రఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా సీఎం చంద్రబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని రైతులకు అండగా నిలుస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం శాంతిపురం మండలం దండికుప్పంలో వ్యవసాయ యాంత్రీకరణపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారులు మురళీకృష్ణ, సావిత్రి, యామిని కలుపు నివారణ, కలుపు తీసే పనిముట్ల వినియోగంపై ప్రయోగాత్మకంగా వివరించారు. వ్యవసాయాధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

గోవధను పూర్తిస్థాయిలో అరికట్టాలి



అయూబ్‌ఖాన్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గోవధను పూర్తిగా అరికట్టేందుకు తాను కృషి చేస్తున్నా.. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అఖిల భారత గోరక్ష మహాసంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ అన్నారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ నిబంధనలు పాటించకుండా గోవులను తరలిస్తే గోవధ చట్టం ప్రకారం ఐదేళ్ల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. మూగజీవాలను తరలించే వాహనాలు ప్రత్యేక రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్నారు. బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బి.నరసింహులు, నాయకులు టీపీఎస్ నాగరాజు, పుదిపట్ల ఆంజప్ప, రామకృష్ణ, శంకర్‌యాదవ్, నాగరాజరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ



పుంగనూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 24, 25, 26 తేదీల్లో జరిగే రాష్ట్ర ఏబీవీపీ 43వ మహాసభలు విజయవంతం చేయాలని పుంగనూరు పూర్వ ఏబీవీపీ నాయకులు విజయశంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వద్ద ఏబీవీపీ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆంజనేయులురెడ్డి, చందు, ఉమాపతి, శివాజీ, వినయ్, భాను, రంజిత్, రాజు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సారా కేసుల్లో ఇద్దరి అరెస్టు



పుంగనూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మంగళవారం చేపట్టిన దాడుల్లో ఇద్దరిని అరెస్టు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కె.సురేశ్‌రెడ్డి తెలిపారు. పుంగనూరు మండలం బోడేవారిపల్లె క్రాసు వద్ద అదే గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు పి.వెంకటేశ్ (49) వద్ద 30 లీటర్ల నాటుసారా స్వాధనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. చౌడేపల్లె మండలం మిట్టూరుకు చెందిన ఎస్.సుకన్య (28) 22 కర్ణాటక మద్యం ప్యాకెట్లు కలిగి ఉండగా బస్టాప్ వద్ద అరెస్టు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సారా తయారీదారులుగా అనుమానితులైన సోమల గాంధీనగర్‌కు చెందిన టి.భాస్కర్, టి.కిరణ్, రాజేష్‌లను పుంగనూరు తహసీల్దార్ రాము ఎదుట బైండవర్ చేశామని వివరించారు. దాడుల్లో చిత్తూరు సీఐ అశోక్‌కుమార్, పుంగనూరు ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో మరో నిందితుడి అరెస్టు

పుంగనూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపురం సమీపంలోని బోయకొండ అటవీ ప్రాంతంలో గత నెల సోమశేఖర్‌రెడ్డి హత్య కేసులో మంగళవారం మరో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ దిగువ మామిడిగుంపలపల్లెకు చెందిన గంగులరెడ్డి కుమారుడు సోమశేఖర్‌రెడ్డి(32) ప్రవర్తన, వేధింపులు భరించలేక కన్నతండ్రే బిడ్డను హత్య చేయించాడు. ఈ కేసులో అప్పట్లో మృతుడి తండ్రితోపాటు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఫణేంద్రనాయక్ పరారీలో ఉండగా మంగళవారం భీమగానిపల్లె శ్రీకృష్ణదేవరాయుల విగ్రహం సమీపంలో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పుంగనూరు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం పరిశీలన



రైతుతో మాట్లాడుతున్న మన్మోహన్

పలమనేరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఫ్రాన్స్‌కు చెందిన రేషుకా జార్జి, రాష్ట్ర రైతు సాధికార సంస్థ అధికారి మన్మోహన్ పర్యటించారు. మొరం గ్రామంలోని రైతు రమేష్ సాగుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటల సాగును పరిశీలించారు. ఏవో సంధ్య, బీఆర్‌సీ ఏవో భారతి, సిరికల్చర్ ఏడీ తులసినాయక్, ఏపీ సీఎన్ఎఫ్ఐ విజయ, కూర్మాయి ఎంటీ ఆర్బీకే ఇన్‌చార్జి స్పందన, జరావారిపల్లి వీఎస్ఏ మహేష్ పాల్గొన్నారు.

కుటుంబాన్ని వెలివేశారంటూ పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమిని రామాలయానికి వదలకుంటే తమ కుటుంబం సంక్రాంతి వేడుకలకు పశువులతో రాకూడదని గ్రామపెద్దలు వెలివేశారని బాధితుడు మంగళవారం పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చినా తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని.. తనకు న్యాయం చేయాలని పుంగనూరు మండలం బరిణేపల్లెకి చెందిన పి.సుధాకర్ పోలీసులను ఆశ్రయించాడు.



అక్రమం.. ఇష్టారాజ్యం..!

- అడ్డూఅదుపు లేకుండా స్థలాల కబ్జా
- పలమనేరులో భూముల ధరలకు రెక్కలు
- పట్టించుకోని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు



పలమనేరులో జాతీయ రహదారిపైకి వచ్చిన దుకాణాలు

పలమనేరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేదల ఊటీగా పేరున్న పలమనేరు నేడు రెవెన్యూ డివిజన్ స్థాయికి పెరగడంతో ఇక్కడ నివేశ, వాణిజ్య స్థలాల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో లక్షల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు క్రమేపీ అన్యాక్రాంతం అవుతున్నాయి. కబ్జాదారులు అదను చూసి ఆక్రమణలకు పాల్పడుతున్నప్పటికీ ఇక్కడి మున్సిపల్, రెవెన్యూ, జాతీయ రహదారి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇష్టారాజ్యంగా కబ్జాదారులు జాతీయ రహదారిలోని వందల ఏళ్లనాటి చింతచెట్లు నరికి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. కొందరు ఆక్రమించిన ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టి వేలాది రూపాయల అద్దెలకు ఇచ్చుకొంటున్నారు. పలమనేరులోని జాతీయ రహదారికి ఇరువైపులా ఆక్రమణకు గురవుతోంది. దాదాపు 120 అడుగుల వెడల్పుతో జాతీయ రహదారికి కేటాయించగా... నేడు 30 అడుగుల వరకు ఇరువైపులా ఆక్రమణలు ఉన్నాయి. 8 అడుగుల ఫుట్‌పాత్ సైతం ఆక్రమించుకొని జాతీయ రహదారికి కేవలం అడుగు దూరం వరకు దుకాణాలు వెలిశాయి. తాజాగా పలమనేరులోని మైన్స్ కార్యాలయం పక్కనే గతంలో నాలుగో తరగతి ఉద్యోగుల అసోసియేషన్ భవనం కోసం ప్రభుత్వం కొంత స్థలాన్ని కేటాయించింది. ఈ స్థలంపై కన్నేసిన అక్రమార్కులు గత రెండురోజుల క్రితం తెల్లవారుజామున చదును చేసే పనులు ప్రారంభించారు. నాలుగో తరగతి ఉద్యోగులు కబ్జాదారులను అడ్డుకోవడంతో పనులను ఆపేశారు. పలమనేరుకు ఆనుకుని అంతర్రాష్ట్ర రహదారిపై ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులు వంతెన నిర్మిస్తున్నారు. అక్కడ ఉన్న మొగిలిరేకుల కుంటను కొంతమేర పూడ్చి ఈ వంతెనను నిర్మిస్తున్నారు. వంతెన నిర్మాణం జరుగుతున్న స్థలంలో ఇంకా దాదాపు 6 ఎకరాల మేర కుంట పొరంబోకు స్థలం ఉంది. దీనిపై కబ్జాదారుల కన్నుపడింది. కొందరు అనధికారికంగా స్థలాలను విక్రయించేందుకు పూనుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పలమనేరులో రాజు కాలువలు, హైవేస్థలాలు, ప్రభుత్వ స్థలాల్లో నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య దుకాణాలు నిర్మించారు. అవి నేటికీ అధికారులు క్రమబద్ధీకరణ చేయలేదు. నేడు కొందరు ఆక్రమణలకు అడ్డూఅదుపూ లేకుండాపోతోంది. ఇకనైనా ఇక్కడి ఆర్డీవో, జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకొని జాతీయ రహదారి ఆక్రమణలను పూర్తి స్థాయిలో తొలగించాలి. కబ్జాదారులపై కఠినంగా వ్యవహరించి అక్రమ నిర్మాణాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



మైన్స్ కార్యాలయం పక్కనే భూమిని చదును చేసిన కబ్జాదారులు



పలమనేరులో జాతీయ రహదారి పక్కన 30 అడుగుల మేర ఉన్న రహదారి స్థలం

పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు



నాయకులతో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి పనులు జరగాలని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం రొంపిచెర్లలో సదుం మండల అధికారులతో పంచాయతీల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగువారిపల్లె పాఠశాల ప్రహరీ, చీకలచేను, గాజువారిపల్లె, గంటావారిపల్లె తదితర గ్రామాల్లో తాగునీటి కష్టాలు, పథకాల మరమ్మతులు, విద్యుత్ సరఫరా, సీసీ రోడ్లు, ఉపాధి హామీ పనుల నిర్వహణ పై నాయకులు, ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అప్పటికప్పుడే సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అనంతరం చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ సముచిత న్యాయం జరిగేలా అధికారులు, నాయకులు పనిచేయా లన్నారు. సమావేశంలో తహసీల్దారు ఎస్.మొహిద్దీన్, ఏపీవో శ్రీనివాసులు, సదుం మండల పార్టీ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులురెడ్డి, సునీల్‌రెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గజదాడుల్లో నష్టపోయిన రైతులకు పరిహారం

పులిచెర్ల మండలంలో గజదాడుల్లో నష్టపోయిన 16 మంది రైతులకు మంగళవారం రొంపిచెర్ల టీడీపీ కార్యాలయంలో పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ప్రభుత్వ అందించిన పరిహారాన్ని పంపిణీ చేశారు. రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, ఎఫ్ఎస్‌వో ఎస్.మహమ్మద్ షఫీ, సీడీవో మౌలా, రైతులు పాల్గొన్నారు.

ఎస్టీల అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యం

- ఏపీ ఎస్టీఎఫ్‌సీ చైర్మన్ శ్రీనివాసులు



ఎస్టీలతో సమావేశమైన ఎస్టీఎఫ్ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం/రామకుప్పం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీల అభివృద్ధికి కట్టుబడి ఉందని.. అందుకు సంబంధించిన పథకాల అమల్లో ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు అన్నారు. కుప్పం నియోజకవర్గంలో ఆయన మంగళవారం పర్యటించారు. కుప్పం మండలం కంగుంది, రామకుప్పం మండలం వీర్నమలతాండాలలో ఎస్టీలతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకోవడమే కాక, వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎస్టీల ఆర్థికాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ట్రైకార్ సంస్థతో కోళ్లు, గొర్రెలు, పశువులను పంపిణీ చేస్తామని చెప్పారు. అలాగే ఎన్జీవోలతో ఆయుష్ మందుల దుకాణాలు, ఆయుష్ వాహనాలను సరఫరా చేస్తామన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం మాట్లాడుతూ గిరిజన సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన చర్యలు తీసుకుంటాయన్నారు. కార్యక్రమాల్లో ట్రైకార్ సభ్యులు టి.అనూరాధ, పి.లావణ్య, జిల్లా గిరిజన సంక్షేమాధికారి మూర్తి, టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు కామరాజునాయక్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణం చెల్లించని వ్యక్తిపై ఫిర్యాదు

పలమనేరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని పారిశ్రామిక వాడలో పరిశ్రమ స్థాపన కోసం తీసుకొన్న రూ. 40 లక్షలకు సంబంధించి రుణం చెల్లించకపోవడంతో కె.అనిల్‌కుమార్ అనే వ్యక్తిపై సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఎఫ్.అనిల్‌కుమార్ ఫిర్యాదు చేశారు. అనిల్‌కుమార్‌తో పాటు చిత్తూరుకు చెందిన రాజేశ్వరి ఫ్యాబ్రికేషన్స్‌పై సీఐ నరసింహరాజు కేసు నమోదు చేశారు.

నకిలీ బీమా సర్టిఫికెట్ మోసంపై కేసు నమోదు

పలమనేరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పలమనేరుకు చెందిన వేణుగోపాలగౌడు తన ట్రాక్టరుకు రూ.15 వేలు తీసుకుని జీవన్‌కుమార్ అనే వ్యక్తి నకిలీ బీమా సర్టిఫికెట్ ఇచ్చాడని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారించి జీవన్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పలమనేరు సీఐ నరసింహరాజు తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

పుంగనూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె సమీపంలో జూదమాడుతున్న ఆరుగురు జూదరులను మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వారి నుంచి రూ.23,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మాలల మనోభావాలు దెబ్బతీయడానికే ఎస్సీ వర్గీకరణ

పుంగనూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మాలల మనోభావాలు దెబ్బతీయడానికే ప్రభుత్వం వర్గీకరణ కోసం కమిటీ వేసిందని పుంగనూరు మాల మహానాడు నాయకులు ఆరోపించారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిత్తూరుకు బయలుదేరి వెళ్లారు. దళిత సంఘ నాయకులు సుమిత్ర రమణ, శ్రీనివాసులు. చంద్ర, రామయ్య, మహేంద్ర, నందీశ్వర్, శ్రీనివాసులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

25న మండల సర్వసభ్య సమావేశం

రొంపిచెర్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 25న ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మధుసూదనరెడ్డి తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమాచారంతో హాజరు కావాలని కోరారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పెద్దపంజాణి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొళత్తూరు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎంపీడీవో బాలాజీ మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం నాణ్యతను పరిశీలించారు. మెనూను తప్పక పాటించాలని.. లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి రాజేష్, ప్రధానోపాధ్యాయులు నగేష్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పెద్దపంజాణి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొళత్తూరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో బాలాజీ మంగళవారం తనిఖీ చేశారు. కూలీలతో పనుల వివరాలు, వేతనాలు, కనీస సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులు నిర్మించుకుంటున్న గోకులం షెడ్లను పరిశీలించారు. ఏపీవో మురుగేష్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేలు వేగవంతం చేయాలి

సోమల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వేలు వేగవంతం చేయాలని తహసీల్దార్ బెన్నురాజ్ తెలిపారు. మంగళవారం మండలంలోని మిట్టపల్లెలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. రైతులు, ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. డీటీ ఇబ్రహీం, సర్వేయర్ షాన్‌వాజ్ పాల్గొన్నారు.

తొలి దశలోనే పంట తెగుళ్లను గుర్తించాలి

సోమల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మంచుతో కూడిన చల్లని వాతావరణలో పంటలకు తెగులు వ్యాప్తి అధికంగా ఉంటుందని.. తొలి దశలోనే పంట తెగుళ్లను గుర్తించాలని వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తెగులు ఆశించిన ఆకులపై చిన్న చిన్న గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయన్నారు. అధికారుల సూచనల మేరకే ఎరువులను వాడుకోవాలని సూచించారు.


నేడు డయల్ యువర్ డీఎం

పలమనేరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22న బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ స్వామి తెలిపారు. బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలపై ఫోన్ నంబరు 9959225678 ను సంప్రదించాలని కోరారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్

పలమనేరు, జనవరి 21: పలమనేరు విద్యుత్ ఏడీఈ కార్యాలయంలో ఈనెల 22న బుధవారం ప్రత్యేక విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఈఈ శ్రీనివాసమూర్తి తెలిపారు. సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి (రిటైర్డు జడ్జి), సభ్యులు, పలమనేరు, సదుం, పుంగనూరు సబ్ డివిజన్ల పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. విద్యుత్తు వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యాపారి మృతి



పుంగనూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి పుంగనూరు సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని మంగళవారం అన్నమయ్య జిల్లాకు చెందిన బొంతల వ్యాపారి మృతిచెందాడు. అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం బోయనపల్లెకు చెందిన రంగయ్య కుమారుడు శ్రీనివాసులు(35) కొద్దిరోజుల క్రితం బొంతల వ్యాపారం కోసం పుంగనూరుకు వచ్చి నక్కబండ వద్ద ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం తన ద్విచక్రవాహనంలో వెళుతుండగా అదుపుతప్పి కరెంట్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దపంజాణి ఇన్‌చార్జి తహసీల్దారుగా అనిల్‌కుమార్

పెద్దపంజాణి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి మండల ఇన్‌చార్జి తహసీల్దారుగా అనిల్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పలమనేరులో డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. అనంతరం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి: జేసీ



రికార్డులు తనిఖీ చేస్తున్న జేసీ విద్యాధరి

బంగారుపాళ్యం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు జేసీ విద్యాధరి సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. గ్రామసభల్లో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, డీటీ కళ్యాణి, ఆర్ఐ మధుసూదన్, సర్వేయర్ లావణ్య పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచాలి: డీపీవో



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి వేదికపై డీపీవో సుధాకరరావు

గంగాధరనెల్లూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి ట్యాంకులతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని డీపీవో సుధాకర్‌రావు ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లతో పారిశుధ్యం, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్వహణపై సమీక్షించారు. కాల్వల్లో దోమలు పెరగకుండా చూడాలన్నారు. గ్రామాల్లోకి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలు, పేడదిబ్బలు తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సేకరించే తడి, పొడి చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లకు తరలించి.. ఎరువులు తయారుచేసి వాటిద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చే మార్గాలపై దృష్టిసారించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

శిఖండి సినిమాలో ఐరాలవాసులు



సినిమాలో ఓ సన్నివేశం

ఐరాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): శిఖండి సినిమాలో ఐరాలకు చెందిన రాజేష్, నీలమ్మ తదితరులు నటించారు. ఈనెల 24వ తేదీన సినిమా విడుదల కానుందని వారు తెలిపారు. ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలను పూతలపట్టు నియోజకవర్గంలో ఎక్కువ శాతం తీసినట్లు పేర్కొన్నారు. చిత్రం ఘన విజయం సాధించాలని కాణిపాక వరసిద్ధుడిని కోరుకుంటున్నట్లు తెలియజేశారు.

మాజీ ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే జగన్మోహన్‌తో కలిసి కేక్ కట్‌చేస్తున్న దొరబాబు

చిత్తూరు సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ దొరబాబు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో, లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో, బీవీ రెడ్డి కాలనీలో కేక్ కట్‌చేశారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, నేతలు కాజూరు బాలాజి, మండి సుధ, గుడిపాల బాలాజీ, త్యాగరాజన్, కోదండయాదవ్,సీఎం విజయ, మోహన్‌రాజ్, రాజశేఖర్, గోపాల్, శంకర్, ఆనంద్, మేషాక్, శ్రీదుర్గ పాల్గొన్నారు.

ఐరాల: దొరబాబుకు మద్దిపట్లపల్లెకు చెందిన ఎంఎస్.చౌదరి, పొలకల ఉపసర్పంచ్ బత్తలసురేంద్రనాయుడు తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అధ్యాపకురాలికి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న శివశ్వేత

చిత్తూరు సెంట్రల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిస్టరీ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఎస్.శివశ్వేతకు సావిత్రిబాయి పూలే జాతీయ అవార్డు లభించింది. సదరన్ ప్రైవేటు లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులో ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఈ అవార్డు ప్రదానం చేశారు.

నేడు సీసీ రోడ్లను ప్రారంభించనున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని పలు పంచాయతీల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో నిర్మించిన సిమెంటు రోడ్లను ఎమ్మెల్యే భానుప్రకాష్ ప్రారంభించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజి పేర్కొన్నారు. బుధవారం ఉదయం మాంగాడులో కార్యక్రమం ప్రారంభమై, సాయంత్రం ఐదు గంటలకు కృష్ణారామాపురంలో ముగియనున్నట్లు తెలిపారు. మొత్తం 12 పంచాయతీల్లో ప్రారంభోత్సవాలు ఉంటాయన్నారు.

రైతులు రీసర్వేకి సహకరించండి



కృష్ణజిమ్మాపురంలో రీసర్వే చేస్తున్న సిబ్బంది

పాలసముద్రం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రీసర్వేకి రైతులు సహకరించాలని తహసీల్దార్ అరుణకుమారి కోరారు. కృష్ణజిమ్మాపురం పంచాయతీలో సర్వే జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ ప్రవీణ్‌కుమార్, సర్వేయర్లు గణేష్, హరి, వీఆర్వోలు తంగరాజ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.





మహవీరపురం వద్ద, మంగళం చెరువు కట్టపై గుంతలమయంగా రోడ్లు

ధ్వంసమైన రోడ్లు

ఇబ్బంది పడుతున్న స్థానికులు

విజయపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు రోడ్లు ధ్వంసమయ్యాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జగన్నాథపురం నుంచి విజయపురం వెళ్లే దారిలో మహవీరపురం వద్ద రోడ్డు ధ్వంసమై ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. అలాగే మంగళం చెరువు కట్టమీద రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయన్నారు. వీటితోపాటు మంగళం కండ్రిగ మలుపు వద్ద, గంగమాంబాపురం, కాళికాపురం వద్ద రోడ్డు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోలేదని తెలిపారు.

మృతుల కుటుంబీకులకు ఆర్థికసాయం



చెక్కు అందిస్తున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

చిత్తూరు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వివిధ పోలీసుస్టేషన్లలో పనిచేస్తూ అనారోగ్య కారణాలతో మృతి చెందిన కానిస్టేబుళ్ల కుటుంబీకులకు మంగళవారం ఏఎస్పీ రాజశేఖర్‌రాజు ఆర్థిక సాయాన్ని అందించారు. విజయపురంలో తంగరాజ్ గత ఏడాది నవంబరు 7న అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య వళ్లియమ్మకు కార్పస్ ఫండ్ నుంచి రూ.లక్ష చెక్కును ఏఎస్పీ అందించారు. అలాగే గత ఏడాది అక్టోబరు 23న ఐరాలలో మృతి చెందిన వెంకటరమణ భార్య రాణికి, సెప్టెంబరు 26న బైరెడ్డిపల్లెలో మృతి చెందిన చలపతి భార్య రమాదేవికి ఒక్కొక్కరికి రూ.లక్ష చెక్కులను ఏఎస్పీ అందజేశారు. బీసెక్షన్ సూపరింటెండెంట్ బాలసుబ్రహ్మణ్యం, క్లర్క్ పార్థసారథి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

క్యాలెండర్ ఆవిష్కరణ

బంగారుపాళ్యం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల క్యాలండర్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకటేషన్, ఉపాధ్యక్షుడు వినయ్ కుమార్, మండల అధ్యక్షుడు శర్వణ్ కుమార్, సభ్యులు భరత్,రూపేష్‌కుమార్ పాల్గొన్నారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. రాహుకాలం పూజలు, కుంకుమార్చనలు చేశారు. భక్తులు పొంగళ్లపెట్టి, నైవేద్యం సమర్పించారు.

వృద్ధులకు అన్నదానం

వెదురుకుప్పం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం వృద్ధాశ్రమంలో మంగళవారం సీడీకండ్రిగకు చెందిన ఆకుల మంగమ్మ కుటుంబీకులు అన్నదానం చేశారు. పండ్లు, స్వీట్లు కూడా పంపిణీ చేశారు.

కూటమితోనే అభివృద్ధి సాధ్యం



మీడియాతో మాట్లాడుతున్న ఏఎస్ మనోహర్

గుడిపాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమౌతుందని మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అవినీతి తప్ప అభివృద్ధి జరిగిందేమీ లేదన్నారు. మండల మాజీ టీడీపీ ఉపాధ్యక్షుడు హరి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి

గుడిపాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలని మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, మాజీ ఎంపీపీ నాగరాజ్ యాదవ్ కోరారు. ఎమ్మెల్యే జగన్మోహన్ చిత్తూరు నియోజకవర్గంలో ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారని గుర్తుచేశారు. శాంతినగర్‌లో తాగునీటి బోరును వెంటనే బిగించాలని విన్నవించారు. ఎంఈవో గణపతి పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించాలి

గంగాధరనెల్లూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతి కల్పించాలని రాష్ట్ర తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కె.యుగంధరాచారి ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒకచోట హైస్కూల్లో కాలేజీ ఏర్పాటుచేసి అందులో స్కూల్ అసిస్టెంట్లకు స్థానం కల్పించాలని విన్నవించారు.

అమరవీరుడికి రోజా నివాళి

నగరి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల ఎదురు కాల్పుల్లో వీరమరణం పొందిన ఎగువరాగిమానుపెంటకు చెందిన కార్తీక్‌కు మాజీమంత్రి ఆర్కే రోజా నివాళి అర్పించారు. జవాను వీరమరణం పొందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎక్స్‌వేదికగా పేర్కొన్నారు.

9 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన తొమ్మిది మందికి కోర్టు జరిమానా విధించింది. సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో సీఐ నిత్యబాబు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో తొమ్మిది మంది మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా గుర్తించి, వారిపై కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. విచారించిన జడ్జి ఉమాదేవి ఒక్కొక్కరికి రూ.10,000 జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

8 మద్యం సీసాల సీజ్ ఒకరి అరెస్టు

వెదురుకుప్పం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు కార్వేటినగరం ఎక్సైజ్ సీఐ శిరీషారెడ్డి మంగళవారం రాత్రి తెలిపారు. కార్వేటినగరం మండలం సురప్పనాయుడుకండ్రిగకు చెందిన సి.షణ్ముగం(62) ఇదే మండలంలోని కలికిరిండ్లు క్రాస్ నుంచి కొల్లాగుంట రోడ్డు మార్గంలో మద్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని.. కేసు నమోదు చేశారు.

విద్యార్థినికి అభినందన



చిత్తూరు క్రీడలు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని న్యూయార్క్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్న చెస్ క్రీడాకారిణి వర్షిణిని ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఆర్‌బీ ప్రసాద్ అభినందించారు. మంగళవారం నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన భరతనాట్య ప్రదర్శనలోనూ ఈ చిన్నారి ప్రతిభ చూపిందన్నారు. చెస్‌తోపాటు నృత్యంలోనూ రాణించడం ప్రశంసనీయమని చెప్పారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో పార్వతి

పెనుమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎల్‌పీవో పార్వతి ఆదేశించారు. మంగళవారం పెనుమూరు, కలవగుంటలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. వీటి నిర్వహణ సరిగాలేదని అసహనం వ్యక్తం చేశారు. రోడ్డు పక్కన చెత్త కుప్పలు అధికంగా ఉన్నాయని, పరిశుభ్రతలో రాజీలేకుండా పనిచేయాలని లేదంటే నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, సెక్రటరీలు ప్రభుకిరణ్, శేషు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి: ఆర్టీవో



ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు సూచనలిస్తున్న అధికారులు

నగరి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రహదారి నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని నగరి ఆర్టీవో వాసుదేవరెడ్డి కోరారు. బస్టాండు ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి బైపాస్ కూడలి వరకు ఆటో, ట్యాక్సీ డ్రైవర్లతో ర్యాలీ నిర్వహించారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, రవాణా,పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కృత్రిమ ఎరువు తయారీపై దృష్టిసారించండి



ముక్కళత్తూరులో షెడ్‌ను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ హిమవంశీ

గంగాధరనెల్లూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లల్లో కృత్రిమ ఎరువు తయారీపై దృష్టిసారించాలని సచివాలయం సిబ్బందిని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ ఆదేశించారు. ముక్కళత్తూరు, కడపగుంట గ్రామాలను మంగళవారం ఆయన సందర్శించారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. డీపీవో సుధాకర్‌రావు, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, పంచాయతీకార్యదర్శులు కిరణ్‌కుమార్, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలకు స్థల పరిశీలన



రీజనల్ జాయింట్ డైరెక్టర్‌తో మాట్లాడుతున్న థామస్

శ్రీరంగరాజపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నూతన మహిళా డిగ్రీ కళాశాల స్థాపన కోసం ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్‌తో కలసి రీజనల్ జాయింట్ డైరెక్టర్ నాగాలింగారెడ్డి స్థల పరిశీలన చేశారు. స్థలంపై తహసీల్దార్‌తోనూ చర్చించారు. ఈ సందర్భంగా థామస్ మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేసి సొమ్ము చేసుకోవాలని చూసిందని మండిపడ్డారు. పీవీకేఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ జీవన జ్యోతి, ఎంపీడీవో మోహన మురళి, తహసీల్దార్ లోకనాథం పిళ్లై, టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, నాయకులు గుండయ్య, నిరంజన్ రెడ్డి, బాలాజీ నాయుడు, కుమార్, పుల్లూరు బాబు, తదితరులు పాల్గొన్నారు.

అపోలో గ్రూప్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డికి సన్మానం



ప్రతాప్ సి రెడ్డితో ఎమ్మెల్యే జగన్మోహన్, దొరబాబు

చిత్తూరు సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అపోలో గ్రూప్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డిని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం రాత్రి చిత్తూరు అపోలో యూనివర్సిటీలో ప్రతాప్ సీ రెడ్డిని సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

24నుంచి ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు

చిత్తూరు సెంట్రల్, జనవరి 21 (ఆంధ్రజోతి): విశాఖలో 24, 25, 26 తేదీల్లో ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని నాయకులు తెలిపారు. ఈ సభలను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా కోర్టు నుంచి గాంధీ విగ్రహం కూడలి వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల వెరిఫికేషన్

పెనుమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలంలో డీఎంహెచ్‌వో పింఛన్లు 23 ఉన్నాయి. వీటిని ధ్రువీకరించడానికి ముగ్గురు వైద్యుల బృందం మంగళవారం మండలంలో పర్యటించింది. లేవలేని స్థితిలో ఉండి రూ.15వేల పింఛను తీసుకుంటున్న వారి వద్దకు వైద్యులే వెళ్లి వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేశారు. పరిశీలనలో బోగస్ పింఛన్లు ఉన్నాయని గుర్తించినట్లు తెలిసింది. వైద్యులు విజయకాంత్, కృష్ణకుమార్, అమృత పాల్గొన్నారు.

టౌన్ బ్యాంక్ మాజీ ఉద్యోగి మృతి



రెడ్డెప్ప నాయుడు (ఫైల్ ఫొటో)

పూతలపట్టు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం నాగిరెడ్డిపల్లెకి చెందిన చిత్తూరు టౌన్ బ్యాంక్ మాజీ ఉద్యోగి కోరా రెడ్డెప్ప నాయుడు అనారోగ్యంతో హైదరాబాదులో మంగళవారం మృతి చెందారు. బుధవారం మధ్యాహ్నం అంత్యక్రియలు ఆయన స్వగ్రామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

టీచర్‌కు జాతీయ పురస్కారం



వెదురుకుప్పం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం గంగమాంబాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కరణం గిరిబాబు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. మంగళవారం విజయవాడలోని కౌత పూర్ణానంద్ విలాస్ కళావేదికలో జరిగిన కార్యక్రమంలో కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

ఇంటింటికీ డోర్ డెలివరీ చేస్తాం



కస్టమర్లకు బహుమతులు ప్రదానం చేస్తున్న జగదీష్

చిత్తూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో సేవల్లో భాగంగా త్వరలో ఇంటింటికీ డెలివరీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ప్రజా రవాణాధికారి జగదీష్ అన్నారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. మాసోత్సవాల సందర్భంగా డెలివరీ చేసిన కస్టమర్లలో లక్కీ డ్రా ద్వారా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డీఎం రూప, ఏడీఎం అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు అభినందన



చిత్తూరు సెంట్రల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డు పొందిన సమగ్ర శిక్ష పూర్వ సెక్టోరియల్ అధికారి, రూటా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ ఖాన్‌ను ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ మంగళవారం తన చాంబర్‌లో అభినందించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఈయన విద్యారంగానికి చేసిన సేవలను తెలుగు వెలుగు సాహితీ వేదిక, కాళోజి బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంస్థ గుర్తించి ఈఅవార్డును ఇటీవల హైదరాబాదులో ప్రదానం చేశాయి.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి అభినందనలు



జగదీశ్వర్ నాయుడికి అభినందనలు తెలుపుతున్న శేషాద్రికుమార్

వెదురుకుప్పం/గంగాధరనెల్లూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన జగదీశ్వర్‌నాయుడికి మంగళవారం పలువురు అభినందనలు తెలిపారు. వీరిలో తెల్లగుండ్లపల్లెకు చెందిన ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాములశేషాద్రికుమార్, అగరమంగళంకు చెందిన ఓబీసీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఇడగట్టి సుధాకర్ తదితరులున్నారు.

12వ పీఆర్సీ కమిషన్‌ను పునరుద్ధరించాలి: యూటీఎఫ్

చిత్తూరు సెంట్రల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): 12వ పే రివిజన్ కమిషన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో మోహన్ కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయి చెల్లింపులు, పాత పెన్షన్ పునరుద్ధరణ, 11 పీఆర్సీ అరియర్స్ రూ.7384 కోట్లు, సరెండర్ లీవ్, ఏపీజీఎల్ చెల్లింపులు చేయాలని కోరారు. రాష్ట్ర, జిల్లా నాయకులు రమణ, సోమశేఖర్‌నాయుడు, రెడ్డెప్ప, బాషా, దక్షిణామూర్తి, సరిత, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.